ఎండుకొమ్మలకు కొంగొత్త సోయగం

ఒంగోలు మామిడిపాలెం సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు-1 పక్కన చిల్లచెట్లపై పెద్ద సంఖ్యలో కొంగలు కనువిందు చేస్తున్నాయి. రోజూ ఉదయం ఆహారానికి వెళ్లి సాయంత్రం మళ్లీ వచ్చి ఆ చెట్లపైనే సేదతీరుతున్నాయి. దూరం నుంచి చూసే వారికి ఎండు కొమ్మలకు తెల్లటి పూలు పూసినట్టు అందంగా కనిపిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం కొమ్మకొమ్మకూ కొంగలు వాలి కొంగొత్త సోయగాన్ని ఆవిష్కరించాయి. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు



ఐజీ సునీల్‌నాయక్‌కు పోలీసుల నోటీసులు

- వాట్సాప్, ఫ్యాక్స్ ద్వారా పంపిన ఎస్పీ కార్యాలయం
- రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నేడు విచారణకు పిలుపు

వివరాలు మెయిన్‌లో..

పంటకు తంటా!

నెలాఖరు వరకే సాగర్ నీరు సరఫరా
అదీ రెండు విడతలుగా 12 రోజులు మాత్రమే

- ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల హెక్టార్లలో పంటలు
- అవసరమైన నీటిలో సగానికి మించి వచ్చే అవకాశం లేని దుస్థితి
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన

ఒంగోలు బ్రాంచ్ కాలువ (ఓబీసీ) కింద సుమారు 1.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎర్రఓబనపల్లి, కారుమంచి, నిప్పట్లపాడు, లక్కవరం తదితర మేజర్లకు అసలు నీరు అందటం లేదు. ఎర్రఓబనపల్లి మేజర్ కింద సాగు చేసిన వరి పంట దశకు వచ్చింది. ఈ సమయంలో నీరు అందకపోవడంతో ఎండుముఖం పట్టింది. తూర్పుచౌటపాలెం, సామంతపూడి, వీరాయపాలెం, రాజంపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన మొక్క జొన్న, మినుము తదితర పైర్లు నీరందక వాడిపోతున్నాయి.

ముండ్లమూరు మండలంలోని రజానగరం, మోదేపల్లి మేజర్ కాలువల పరిధిలో వరి, మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉండగా నీటి ఎద్దడి ఏర్పడింది. ఇప్పటికే ఎకరానికి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ దశలో నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో తడులకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు.

ఇదీ.. ఉమ్మడి జిల్లాలోని సాగర్ ఆయకట్టులో పరిస్థితి. దాదాపు 2 లక్షల ఎకరాల్లో పైర్లు చేతికి వచ్చే దశలో నీటి సమస్య ఉత్పన్నమైంది. సాగర్ నీటి సరఫరా విషయంలో తాజాగా చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వచ్చే నెల 15 వరకు పలు ప్రాంతాల్లో నీటి అవసరం ఉన్నప్పటికీ ఈ నెలాఖరు వరకు మాత్రమే అందనుంది. అందులోనూ వారబందీ అమల్లోకి రావడంతో కేవలం రెండు విడతలుగా ఒక్కో దఫా ఆరు రోజుల చొప్పున 12 రోజులు మాత్రమే నీటి సరఫరా కానుంది. అది వాస్తవ అవసరంలో సగానికి మించి కూడా ఉండకపోవడం రైతులను కలచి వేస్తోంది.



పంట ఎండిపోయి నష్టపోతాం

నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. కంకి తీసే దశలో ఉంది. ఒంగోలు బ్రాంచ్ కాలువ పరిధిలో చివర ఉన్న ఆయకట్టు భూములకు గత కొద్ది రోజులుగా నీరు అందటం లేదు. ఇప్పుడు వారబందీ అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పైరు ఎండిపోయే తీవ్రంగా నష్టపోతాం.

- మారం వెంకటేశ్వరరెడ్డి, తూర్పుచౌటపాలెం

ఒంగోలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఆయకట్టుకు నీటి గండం ఏర్పడింది. పైరు చేతికొచ్చే దశలో రైతులకు తంటాలు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. డ్యాం నుంచి సరఫరాపై కేఆర్‌ఎంబీ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఫిర్యాదుతో కీలక సమయంలో పొలాలకు నీరందే అవకాశం తగ్గిపోయింది. సాగర్ జలాశయంలో ప్రస్తుతం 42 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. కుడి కాలువ పరిధిలో ఉన్న ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు 28 టీఎంసీలు అవసరమని ఇక్కడి అధికారులు నివేదించారు. అందులో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి, పొగాకు, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు ఉన్నాయి. వాటికి మార్చి ఆఖరు వరకు చూసినా 10 టీఎంసీలకుపైగా అవసరం ఉంది.

ప్రధానంగా దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని రజానగరం, దర్శి, వీరేపల్లి, నిప్పట్లపాడు, రాజంపల్లి, కరవది, త్రోవగుంట, చిలకపాడు, ఈతముక్కల, కారుమంచి మేజర్ల పరిధిలోనూ.. బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని పలు మేజర్ల కింద ఈ పంటలు ఉన్నాయి. అలా ఉమ్మడి జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో సాగర్ ఆయకట్టులో సాగులో ఉన్న పంటలకు నీరు అవసరమైన ప్రస్తుత సమయంలో పైనుంచి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

వచ్చేది 5 టీఎంసీలే

సాగర్ కుడి ప్రధాన కాలువ 85/3 వద్ద రోజుకు 2వేల నుంచి 2,300 క్యూసెక్కులు, బాపట్ల జిల్లా పరిధిలోని ఏబీసీకి 1,200 క్యూసెక్కుల వంతున వచ్చే 12 రోజులు నీరు సరఫరా కానుంది. ఆ ప్రకారం చూస్తే 85/3 దిగువన మన జిల్లాకు 2.50 టీఎంసీలు, అద్దంకి బ్రాంచి కాలువ (ఏబీసీ)కు 1.25 టీఎంసీలు వెరసి 3.75 నుంచి 4 టీఎంసీలు మాత్రమే ఇవ్వనున్నారు. పల్నాడు జిల్లాకు సరఫరా చేసే సమయంలో కొంత నీరు దిగువకు ఇచ్చినా అది మరో టీఎంసీకి మించి ఉండదు. ఆ లెక్కన చూసినా ఈ నెలాఖరు లోపు ఉమ్మడి జిల్లాకు 5 టీఎంసీలకు మించి నీరు వచ్చే అవకాశం లేదు. సాగర్ ఆయకట్టు చివరి భూముల్లో పంటలకు తీవ్ర నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది.



ముండ్లమూరు మండలంలోని చింతలపూడిలో కంకి దశలో ఉన్న వరిని చూపుతున్న రైతు



దర్శి బ్రాంచి కాలువలో ప్రవాహం లేక నిశ్చలంగా ఉన్న నీరు

సాగర్ డ్యాం నుంచి తగ్గిన పరిమాణం

రాష్ట్రానికి నీరు వచ్చే కుడికాలువకు డ్యాం నుంచి గతంలో తీసుకుంటున్న 9 నుంచి 10 వేల క్యూసెక్కులను 6వేలకు తగ్గించుకోవాలని కేఆర్‌ఎంబీ ఆదేశించింది. దాని వల్ల కుడికాలువ నుంచి రాష్ట్రానికి తీసుకొనే నీటి పరిమాణం భారీగా తగ్గనుంది. రోజుకు 6వేల క్యూసెక్కుల వంతున తీసుకుంటే మార్చి ఆఖరు వరకు రెండు లక్షల క్యూసెక్కులు మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది. అంటే 18 నుంచి 19 టీఎంసీల నీరు మాత్రమే వస్తుంది. అందులో ఉమ్మడి గుంటూరు జిల్లా అవసరాలు పోను ఉమ్మడి ప్రకాశంలో అవసరమైన దానిలో మూడోవంతుకు మించి అందే అవకాశం లేదు.

వారబందీ అమలు

తాజా పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో నీటి సరఫరాకు వారబందీ విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఇప్పటి వరకు ప్రస్తుత పల్నాడు జిల్లాలో అధికంగా నీటి వాడకం జరుగుతోంది. వారబందీ విధానం ఆదివారం నుంచి అమలు చేస్తుండగా ఆరు రోజులు పల్నాడు ప్రాంతంలో కాలువలు మూసేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు నీరు ఇస్తారు. అనంతరం 9 రోజులపాటు దిగువకు.. ఆపై పల్నాడు ప్రాంతానికి సరఫరా చేస్తారు. తర్వాత తిరిగి ఆరు రోజులు పల్నాడు ప్రాంతానికి ఆపి దిగువన ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఇస్తారు. అంటే ఈనెలాఖరులోపు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు రెండు విడతలుగా 12 రోజులు మాత్రమే నీరు రానుంది.

నిబంధనలు కఠినతరం.. అనుమతులు సరళతరం



- భవన నిర్మాణాలపై కొత్త జీవోలు విడుదల
- మార్గదర్శకాలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ
- టౌన్‌ప్లానింగ్‌లో చేతివాటానికి చెక్

7



చీరాలలోని కోటయ్య వృద్ధాశ్రమం

ఆశ్రమాలకు ఆదరణ

- వృద్ధులకు ఎంతో ఆసరాగా ఉంటున్న వైనం
- హోంలకు పెరుగుతున్న పండుటాకుల సంఖ్య
- సమయానికి అన్నీ సమకూరుస్తుండడంతో ఆనందంగా గడుపుతున్న వయసు మళ్లినవారు

7

నేటి నుంచి ఎఫ్‌ఏ-4 పరీక్షలు

- షెడ్యూల్‌ను ప్రకటించిన పాఠశాల విద్య కమిషనర్

ఒంగోలు విద్య, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఎఫ్‌ఏ-4 (ఫార్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు షెడ్యూల్‌ను ప్రకటించారు. ప్రశ్నపత్రాలను ఎస్సీఈఆర్టీ సరఫరా చేస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయి. హైస్కూళ్లు, యూపీ స్కూళ్లలో 6నుంచి 8 తరగతుల వరకు చదువుతున్న వారికి మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటల వరకు, 2.45 నుంచి 4 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. హైస్కూళ్లలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 10.45 గంటల వరకు, 11నుంచి 12.05 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. 1నుంచి 5 తరగతుల విద్యార్థుల ప్రశ్నపత్రాలను స్కూలు కాంప్లెక్స్‌ల్లో, 6నుంచి 9 తరగతుల ప్రశ్నపత్రాలు ఎమ్మార్సీలలో భద్రపర్చాలని కమిషనర్ ఆదేశించారు.



విద్యార్థులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- అంబేడ్కర్ స్ఫూర్తితో ఉన్నత స్థాయికి చేరుకోవాలి
- వసతిగృహ విద్యార్థులకు మంత్రి స్వామి పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాలని వసతి గృహ విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులతో ఆదివారం మంత్రి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెం నుంచి జూమ్ (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. విద్యతోనే మెరుగైన భవిష్యత్ సాధ్యమన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి ఉత్తమ విద్య, నాణ్యమైన భోజనం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వీటిని వినియోగించుకొని ఉత్తమ మార్కులతో అందరూ ఉత్తీర్ణులై తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. విద్యార్థుల్లో ధైర్యం నింపేందుకే తాను నేరుగా మాట్లాడుతున్నానని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు ప్రతిభను చాటాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని మంత్రి స్వామి పేర్కొన్నారు. వసతిగృహాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వమే గార్డియన్‌గా ఉంటుందన్నారు. వారి రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ హాస్టళ్లలో జరుగుతున్న పనులను మంత్రి స్వామి ఆన్‌లైన్‌లోనే పరిశీలించి ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌బాబుకు పలు సూచనలు చేశారు. అంతకుముందు సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ వసతిగృహాల విద్యార్థుల వివరాలను, పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్న తీరును వివరించారు. ఈ జూమ్ కార్యక్రమంలో జిల్లాలోని ఏఎస్‌డబ్ల్యూవోలు తమ పరిధిలోని వసతిగృహాల నుంచి పాల్గొన్నారు.

కాపీయింగ్‌కు కలెక్షన్!

జిల్లాలో ఓపెన్ సొసైటీ పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ వ్యవస్థీకృతమైపోయింది. ఏటా సుమారు రూ.కోటికిపైన వ్యాపారం జరుగుతోంది. కాపీయింగ్‌ను సహించేది లేదని అధికారులు ఆర్భాటంగా ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో గుట్టుచప్పుడు కాకుండా కొందరు స్టడీ సెంటర్ల నిర్వాహకులు, దళారులు మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాస్ గ్యారెంటీ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి ఇంటర్మీడియట్‌కు రూ.5వేలు, పదో తరగతికి రూ.2వేల వంతున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- 'ఓపెన్' పరీక్షల్లో పాస్ గ్యారెంటీ పేరుతో ఏటా రూ.కోటి వ్యాపారం
- ఒక్కో విద్యార్థి వద్ద ఇప్పటికే రూ.వేలల్లో వసూలు
- నేటి నుంచి పరీక్షలు ప్రారంభం

ఒంగోలు విద్య, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు 64, 10వ తరగతి విద్యార్థులను చేర్చుకునేందుకు 28 సెంటర్‌లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో 4,175 మంది, పదో తరగతిలో 1,564 మంది విద్యార్థులు నమోదయ్యారు. ఇంటర్ విద్యార్థులకు 21, 10వ తరగతి విద్యార్థులకు 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పాతపద్ధతిలోనే పరీక్షలు

కాపీయింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు పరీక్షల నిర్వహణ విధానాన్ని మార్చాలని ప్రభుత్వం యోచించింది. ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలను ఆయా బోర్డుల ఆధ్వర్యంలో ఒకేసారి రెగ్యులర్‌తో కలిపి నిర్వహించాలని భావించింది. కానీ ఆచరణలో అది సాధ్యం కాలేదు. దీంతో పాత పద్ధతిలోనే పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. ఇంటర్ బోర్డు పరీక్షలు నిఘా కెమెరాల నీడలో జరుగుతుండగా, ఓపెన్ పరీక్షలు మాత్రం పాత పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు.



21 పాఠశాలలకు ఒంటి పూట బడులు

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్న ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు కేంద్రాలుగా ఏర్పాటు చేసిన 21 హైస్కూళ్లకు ఒంటిపూట తరగతులు నిర్వహించనున్నారు. ఈమేరకు డీఈవో కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ హైస్కూళ్లలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ తరగతులు నిర్వహించనున్నారు. పరీక్ష లేని రోజు రెండు పూటలా తరగతులు ఉంటాయి.

పాస్ గ్యారెంటీ పేరుతో వసూళ్లు

పాస్ గ్యారంటీ పేరుతో ఓపెన్ స్కూల్ విద్యార్థుల నుంచి కొన్ని స్టడీ సెంటర్ల నిర్వాహకులు, దళారులు భారీ మొత్తాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. పరీక్షల విధులకు స్టడీ సెంటర్ల నిర్వాహకులు సిఫార్సు చేసిన వారినే ఓపెన్‌స్కూలు సొసైటీ కార్యాలయం నియమిస్తోంది. ఈ నియామకాల్లో కార్యాలయ సిబ్బంది, అనధికారికంగా అక్కడ పనిచేసే ఒక టీచర్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. స్టడీ సెంటర్ల నిర్వాహకులు కోరుకున్న వారే పరీక్షల నిర్వాహకులుగా రావడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాట అయింది. ఇంటర్ విద్యార్థుల నుంచి రూ.5వేలు, పదో తరగతి విద్యార్థుల నుంచి రూ.2వేల చొప్పున ఇప్పటికే వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అడ్మిషన్లు గత ఏడాది డిసెంబరు వరకు కొనసాగాయి. స్టడీ మెటీరియల్ పంపిణీలో జాప్యమై జనవరిలో వారికి అందింది. దీంతో విద్యార్థులు చదువుకొనేందుకు కూడా సమయం లేకుండా పోయింది. దీన్ని అవకాశంగా తీసుకొని స్టడీ సెంటర్ల నిర్వాహకులు, దళారులు పాస్ గ్యారెంటీ పేరుతో వేలకు వేలు దండుకున్నట్లు తెలుస్తోంది.



700 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

7

ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలి

పోలీసులకు ఎస్పీ దామోదర్ ఆదేశం

7

కారుమంచి మేజర్ కర్షకుల క'న్నీటి'కష్టాలు

సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు

లేకుంటే పంటలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన



నీటి సరఫరా లేని కారుమంచి మేజర్ కెనాల్



పల్లామల్లిలో ఎండిపోతున్న మొక్కజొన్న పంట

చీమకుర్తి, మార్చి2(ఆంధ్రజ్యోతి) : అధికారుల ప్రణాళికాలోపం రైతులపాలిట శాపంగా మారుతోంది. ప్రాజెక్టుల్లో పుష్కలంగా జలాలు ఉన్నా పంటలకు సాగునీటిని సరైన సమయంలో సరఫరా చేయటంలో విఫలం చెందుతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఆరుగాలం పండించిన పంటలకు కీలకమైన దశలో నీరు అందివ్వలేకపోవటం పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని దిగాలు పడుతున్నారు. ఇవన్ని కారుమంచి మేజర్ కింద పంటలు సాగు చేసిన కర్షకుల కన్నీటి కష్టాలు. రైతుల కష్టనష్టాల పట్ల ఇరిగేషన్ శాఖాధికారులు కాసింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కారుమంచి మేజర్‌కు సాగునీరు సరఫరాను రామతీర్థం జలాశయం ఎగువ నుంచి చేయాల్సి ఉంది. జలాశయానికి ఎగువన ఒంగోలు బ్రాంచ్ కెనాల్ 26వ మైలురాయి వద్ద రెడ్డిసాగర్ నుంచి నీటిని కారుమంచి మేజర్‌కు సరఫరా చేయాలి. ఈ మేజర్ కింద తాళ్లూరు మండలంలోని గ్రామాలతో పాటు చీమకుర్తి మండలంలోని పల్లామల్లి, ఇలపావులూరు, బండ్లమూడి, తొర్రగుడిపాడు, నేకునంబాదు, గాడిపర్తివారిపాలెం, చంద్రపాడు గ్రామాలకు చెందిన రైతులు పంటలను సాగు చేశారు. పొగాకు, మొక్కజొన్న, వరి పంటలకు ప్రస్తుతం అత్యవసరంగా సాగునీరు అందివ్వాల్సి ఉంది. రామతీర్థం రిజర్వాయర్‌లో నిండుగా నీరు ఉన్నా కరవది మేజర్ రైతాంగానికి ప్రయోజనం లేదు. జలాశయంలోకి సాగర్ జలాలను నింపే క్రమంలోనే ఓబీసీ ద్వారా సాగర్ జలాలను కరవది మేజర్‌కు సరఫరా చేయాల్సి ఉంది. దీంతో అధికారుల దృష్టి రామతీర్థం జలాశయం నింపటంపైనే ఉంటుంది కాని కరవది మేజర్‌కు నీటిని సరఫరా చేయాలనే విషయాన్ని విస్మరిస్తున్నారు. ప్రస్తుతం గత వారం రోజుల నుంచి జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ఓబీసీ ద్వారా నామమాత్రంగా సాగర్ జలాలు వస్తుండటంతో కరవది మేజర్‌కూ నీటిని సరఫరా చేయలేకపోతున్నారు.

మరో రెండురోజుల్లో సాగర్ జలాలు రానున్న పరిస్థితులు కనపడుతున్నాయి. ఇప్పుడైనా కరవది మేజర్‌కు సాగునీటిని సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి కోసం ఎదురు చూస్తున్నాం..



కరవది మేజర్ ఆయకట్టు పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. డీసీ పరిధిలో పది సాగునీటి సంఘాల అధ్యక్షులతో సహ నేనూ ఇరిగేషన్ అధికారులను నీరు సరఫరా చేయాలని కోరి ఉన్నాము. వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- దొడ్డా వెంకట్రావు, డీసీ అధ్యక్షుడు, చీమకుర్తి-1

సాగర్‌నీరు వస్తే సరఫరా చేస్తాం

ఓబీసీ 0/0 వద్ద నుంచి దిగువకు నీరు సరఫరా కావటం లేదు. వారబంది విధానంతో సాగర్ నుంచి నీరు రెగ్యులర్‌గా రావటం లేదు. కరవది మేజర్ ఆయకట్టు కింద పంటలకు సాగునీరు అవసరమనే విషయం మా దృష్టికి వచ్చింది. సాగర్ జలాలు రాగానే కరవది మేజర్‌కు సరఫరా చేస్తాం.

-గిరిబాబు, ఇరిగేషన్‌శాఖ డీఈ, చీమకుర్తి

ఘనంగా శ్రీనివాస ఈఎన్‌టీ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పక్కన మేయర్ గంగాడ సుజాత, పాపారావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం సత్యనారాయణ పురంలోని 60 అడుగుల రోడ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీనివాస ఈఎన్‌టీ హాస్పిటల్‌ను ఆదివారం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత, చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు నారపుశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యంత అధునాతమైన ఆపరేషన్ థియేటర్, అనుభవం కలిగిన ల్యాబ్ టెక్నీషియన్‌లతో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత పాపారావు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పనుల పరిశీలన



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఊరచెరువులో గల దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ సమీపంలో జరుగుతున్న సెంటర్ డివైడర్ పనులను కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ రహదారిలో ఆక్రమణలు ఉండటంతో ఎట్టకేలకు ఇటీవల తొలగించారు. ఈ నేపథ్యంలో ఆ రోడ్డును విస్తరించి, సెంటర్ డివైడర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మెడికల్ క్యాంపునకు స్పందన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, యూటీఎఫ్, దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 1708 మందికి వైద్యసేవలు పొందారు. వైద్యులు బి.హరిబాబు, జాన్‌రిచర్డ్స్, చాపల వంశీకృష్ణ, ఎం.శరత్, సుందర్‌బాబు, రంజిత్‌బాషాలు వైద్య సేవలను అందించారు. రూ.400లకే నాలుగు నెలలకు సరిపడా మందులను అందజేశారు. రోగులకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తున్నట్లు మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు నిర్వహణకు రూ.10వేల చొప్పున అర్థిక సహాయం అందజేసిన డాక్టర్ జవహర్‌కు, ఢాకా సుబ్బారెడ్డి, రూ.2వేలు సహాయం అందజేసిన రిటైర్డ్ హెచ్‌ఎం కనపర్తి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞావికాస్ పరీక్ష

ఒంగోలు విద్య, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆర్‌ఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నలంద హైస్కూలులో ప్రజ్ఞాన్‌వికాస్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అవినాష్ మాట్లాడుతూ ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎన్.ప్రసాద్, ప్రిన్సిపాల్ గౌతమ్ పాల్గొన్నారు.

శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది ఆదివారం ఉదయం స్థానిక రంగారాయుడు చెరువుపై వాకర్స్‌కు నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేయగా హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కొప్పోలు సౌమిత్రపల్లవ్, జనరల్ మేనేజరు బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, వాకర్స్ క్లబ్ సెక్రటరీ దేసుకాశీవిశ్వనాథ్, సభ్యులు మారెళ్ళ సుబ్బారావు, కోటిరెడ్డి, ఎస్.సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సునీల్‌కుమార్ అరెస్టు అక్రమం

ఒంగోలు క్రైం, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీవీ.సునీల్‌కుమార్ అరెస్టు అక్రమం అని ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత అజెండాలు ఏమీ ఉండవని, పాలకులు సూచనల మేరకు పనిచేస్తారని పేర్కొన్నారు. ఉద్యోగులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం దారుణమని, సునీల్‌కుమార్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్, నాయకులు మల్లి తదితరులు డిమాండ్ చేశారు.

అరకొర నిధులతో వెలిగొండ పూర్తి ఎలా?



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొండపి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులతో వెలిగొండ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కొండపిలోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, సీపీఎం జిల్లా నాయకురాలు కంకణాల రమాదేవి, వి.మోజెస్, సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



దుస్తులను అందజేస్తున్న రాధాక్రిష్ణ

టంగుటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంతా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి కలిగి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ అధికార ప్రతినిధి రావూరి తిరుమల రాధాక్రిష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బ్రహ్మంగారి గుడి ఆవరణలో రావూరి వినీల మెమెరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 42 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొనే పేద విద్యార్థులకు 14 మందికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

గ్రావెల్ టిప్పర్ పట్టివేత

మద్దిపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం ఎర్రజర్ల కొండ నుంచి అక్రమంగా గ్రావెల్‌ను సీతారాంపురం తరలిస్తుండగా మద్దిపాడు పోలీసులు టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ రమేష్‌కృష్ణ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ నివాసంలో ఆదివారం పలువురికి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. మండలంలోని చిలక పాడు గ్రామానికి చెందిన పెట్లూరు శేషమ్మకు రూ.80వేలు, పేర్నమిట్టకు ఎస్.అనురాధకు రూ.40వేలు, ఎం.హర్షవర్ధన్‌కు రూ.25వేలు, బి.కుమార్‌రాజాకు రూ.20వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండవ జయంత్‌బాబు, జి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

మద్దిపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన మహిళ శనివారం రాత్రి మృతి చెందినట్లు మద్దిపాడు పోలీసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం అద్దంకికి చెందిన తాటి అజయ్‌కుమార్ తన తల్లి పుష్పావతితో కలిసి ద్విచక్రవాహనంపై ఒంగోలు నుంచి ఇంటికి వెళ్తుండగా ఏడుగుండ్లపాడు మార్కెట్ యార్డ్ దగ్గర వెనక నుంచి వచ్చిన వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తల్లీకుమారులు గాయపడ్డారు. వీరు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా తల్లి పుష్పావతి మరణించింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చిలకపాడు గ్రామంలో ఆదివారం రాత్రి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తొరటి ఆనంద్‌మాదిగ, పి.శ్రీను, అశోక్, బిక్షాలు నాగేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● మంత్రి స్వామి

టంగుటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. టంగుటూరులో ఇటీవల నూతనంగా నిర్మించిన సైడు కాలువలు, డ్రెయిన్లు, సిమెంట్ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. టంగుటూరులోగల 8వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ఇటీవల జరిగాయి. వాటిని పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గ్రామ సచివాలయం కార్యదర్శి

కొండపి: కొండపి గ్రామ సచివాలయం కార్యదర్శిగా వున్నం రామ్మోహన్‌ను జిల్లా అధికారులు నియమించారు. సంతనూతపాడు మండలం చిలకపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామ్మోహన్ ఆదివారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి స్వామి రామ్మోహన్‌తో మాట్లాడుతూ కొండపి గ్రామ పంచాయతీలో పారిశుధ్య సమస్యలేకుండా చూడాలని, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.



డ్రైనేజీకి సంబంధించిన తూమును పరిశీలిస్తున్న మంత్రి స్వామి

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..

వైసీపీ హయాంలో గోతులమయంగా రోడ్లు ● కూటమి ప్రభుత్వంలో మరమ్మతులు ● మంత్రి స్వామి చొరవతో రూ.13 లక్షలు మంజూరు



సాయిబాబా మందిరం ఎదుట రోడ్డును పునరుద్ధరిస్తున్న కూలీలు



కలికివాయి ఫ్లైవోవర్ వద్ద గుంతలు లేని రోడ్డు

సింగరాయకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం పాలన పడకేయడంతో మండలంలోని పలు రహదారులు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా అఘోరించాయి. ప్రజల ఒళ్లు, వాహనాలు గుల్లయ్యేవి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. కొన్నిచోట్ల కొత్త రోడ్లు నిర్మిస్తుంటే మరికొన్ని చోట్ల అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేసి అద్దంలా మెరిసేలా చేస్తున్నారు. అందులో భాగంగా సింగరాయకొండలో గజానికొక గుంత ఉన్న ట్రంకు రోడ్డు, సింగరాయకొండ- ఊళ్లపాలెం రోడ్డు మరమ్మతులకు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో రూ.13 లక్షల నిధులు మంజూరయ్యాయి. రూ.5 లక్షల నిధులతో సింగరాయకొండ ట్రంకు రోడ్డుపై గుంతలు పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు. కలికివాయి ఫ్లైవోవర్ సమీపంలో సింగరాయకొండకు ములుపు వద్ద ఉన్న గుంతలను పూడ్చివేశారు. దీంతో ప్రమాదాలు జరిగే చోట వాహనచోదకులు ప్రశాంతంగా ప్రయాణిస్తున్నారు. సింగరాయకొండ- ఊళ్లపాలెం రోడ్డును కూడా రూ.8లక్షలతో మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

9న సీవీఎన్ రీడింగ్ రూం ఎన్నికలు

● ఎన్నికల అధికారి వెంకటసుబ్బారావు



మాట్లాడుతున్న వెంకటసుబ్బారావు

ఒంగోలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 9వ తేదీన జరుగుతాయని ఎన్నికల అధికారి చిల్లర వెంకట సుబ్బారావు తెలిపారు. ఆదివారం స్థానిక క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఎన్నికలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతాయని, ఇందుకోసం క్లబ్‌లో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి బూత్‌లో ఇద్దరు ప్రిసైడింగ్ అధికారులు ఉంటారన్నారు. షటిల్ కోర్ట్‌లో ఒకటి, క్యారమ్స్ కోర్టులో ఒకటి పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామని, మొత్తం 970 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి కౌంటింగ్, రాత్రికి ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. అధ్యక్ష పదవికి నలుగురు, ఉపాధ్యక్షులుగా ఇద్దరు, కార్యదర్శి పదవికి ముగ్గురు. సంయుక్త కార్యదర్శి పదవికి ఇద్దరు, కోశాధికారికి ఆరుగురు, ఈసీ మెంబర్లుగా 12 మంది పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి ఓటరుకు బ్యాలెట్ పేపర్ ఇస్తామని, తమ వెంట తప్పనిసరిగా ఆధార్‌కార్డును తీసుకురావాలని పేర్కొన్నారు. అదేవిధంగా పోటీలో 12 మంది ఈసీ మెంబర్లుగా ఉన్నప్పటికీ తమకు నచ్చిన ఆరుగురికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుందని, అంతకుమించి ఓటు వేస్తే చెల్లదని తెలిపారు. ఇక ఆరోజు క్లబ్ ఆవరణలోకి ఓటర్లను తప్ప ఇతరులను అనుమతించబోమని, ఎన్నికల సందర్భంగా బందోబస్తు కోసం పోలీస్‌శాఖకు విజ్ఞాపన పత్రం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు కనుమాల రాఘవులు, వారణాసి శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు

ఒంగోలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వాసవి మెలోడీస్ ఆధ్వర్యంలో బాలాజీ క్రియేషన్స్ కళాకారులు ఆదివారం సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో ముందుగా గాయకులు ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొనసాగిన సంగీత విభావరిలో వారణాసి బాలాజీ, ఆలపాటి అశోక్, గుర్రం శివప్రసాద్, రంగా, నున్నా శ్రీనివాసరావు, తన్నీరు బాలాజీ, ఎస్.శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, ఎస్‌కే.ఖాదర్, అక్బర్‌వలి, శైలజ, సుహాసిని, యామినీ, ఉషారాణి పలు గీతాలను ఆలపించారు. వెన్నూరి నాగేశ్వరరావు నిర్వహణ సహకారాన్ని అందజేశారు.

విద్యుదాఘాతంతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

పుల్లలచెరువు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఉపాధి హామీ పథకం కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. పుల్లలచెరువు మండలం కొత్తూరుకు చెందిన దండేబోయిన కోటేశ్వరరావు ఎర్రగొండపాలెంలో ఉపాధిహామీ పథకంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో ఆర్వో ప్లాంటులో నీరు వచ్చే పంప్ మోటారు స్విచ్చాఫ్ చేస్తుండగా షాక్ తగిలి కోటేశ్వరరావు(40) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

రామకృష్ణ పరమహంస బోధనలు శిరోధార్యం



ప్రసంగిస్తున్న స్వామి వినిశ్చలానంద మహారాజ్

ఒంగోలు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ పరమహంస బోధనలు ప్రతి ఒక్కరికీ శిరోధార్యమని విజయవాడ రామకృష్ణ మిషన్ స్వామీ వినిశ్చలానంద మహారాజ్ అన్నారు. రామకృష్ణ పరమహంస 190వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కోర్టుసెంటర్‌లోని రామకృష్ణ సేవాసమితిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ఒ.ఉమాశంకర్, మైనంపాటి సాయికుమార్, దయాకర్, శంకరరెడ్డి, మాల్యాద్రి, ఓవీ.శాస్త్రి, రంగారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు

సింగరాయకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ, జరుగుమల్లి మండలాలలో పలువురు క్రికెట్ బుకీలను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాదాపు 10 మంది బుకీలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమాచారం బయటకు పొక్కడంతో వైసీపీ హయాంలో ఆపార్టీ నాయకుల మద్దతుతో విచ్చలవిడిగా బెట్టింగులు నిర్వహించి రూ. కోట్ల అక్రమంగా సంపాదించిన పలువురు బుకీలు ఇప్పటికే రాష్ట్రం వదిలివెళ్లారు. దీంతో వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

నా అనే వాళ్లు లేరు, తిన్నావా అని ప్రేమతో అడిగే వారు లేరు, టైంకు ఆహారం వండుకుని తినడానికి సత్తువ లేదు. ఒంట్లో నలతగా ఉంటే మందుగోలీ తెచ్చి ఇచ్చే దిక్కు లేదు. చేతిలో రూపాయి డబ్బులేదు.

- ఇది ఓ అవ్వ దీనగాథ.

కన్నపిల్లలు బతుకుదెరువు కోసం సుదూరప్రాంతాలకు వలస వెళ్లారు. పిల్లలకు భారమయ్యాం అని నిత్యం మానసికంగా నలిగి పోతుంటుంటారు. సొంతూర్లో ఉన్నా ఏదో వెలితి వెంటాడుతూనే ఉంటుంది.

- ఇది ఓ వృద్ధ తల్లిదండ్రుల మనోగతం

చెప్పుకోవడానికి అందరూ ఉన్నారు.. కానీ అనాథగానే బతుకుతున్నారు.. కని సాకి పెద్ద చేసిన పిల్లలు, తల్లిదండ్రుల పోషణ బాధ్యతను గాలికొదిలేశారు. తిన్నారా, పడుకున్నారా అని పలకరించరు.. ఈ పరిస్థితుల్లో పరువు బజారున పడుతుందన్న బాధతో అనునిత్యం కుమిలిపోతుంటారు.

- ఇదీ ఓ వృద్ధ జంట బాధ

దేనికీ లోటు లేదు. దేశవిదేశాల్లో ఉన్న కన్నపిల్లలు నెలనెలా ఠంచన్‌గా డబ్బు పంపుతుంటారు. కానీ మనస్సును ఏదో తెలియని బాధ తొలిచేస్తూ ఉంటుంది. కాస్త నలుగురిలో ఉంటే.. సాదకబాధలు చెప్పుకుంటుంటుంటే మనసు తేలికపడుతుంది.

- ఇది వయసు మళ్లిన ఓ జంట ఆలోచన


ఆశ్రమంలో పండుటాకులు

ఆశ్రమాలకు ఆదరణ

వృద్ధులకు ఎంతో ఆసరాగా ఉంటున్న వైనం

ప్రస్తుత కాలంలో వృద్ధాశ్రమాలకు పెరుగుతున్న పండుటాకుల సంఖ్య

సమయానికి అన్నీసమకూరుస్తుండడంతో ఆనందంగా గడుపుతున్న వయసు మళ్లిన వారు

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో వృద్ధాశ్రమాలకు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వీటిని స్థాపించారు. కొన్నిచోట్ల పూర్తి సేవాభావంతో వృద్ధాశ్రమాలను నిర్వహిస్తుండగా, ఇంకొన్నిచోట్ల నెలనెలా కొంత నగదు తీసుకుని వృద్ధులను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. అయితే ఒక్కో కుటుంబానికి ఒక్కో కారణం ఉంటుంది.. ఒక్కో గాథ ఉంటుంది.. ఒక్కో బాధ ఉంటుంది.. ఇంకొందరికి తల్లిదండ్రులపై ప్రేమ ఉన్నా దగ్గరకు చేరదీసే వీలు ఉండదు.. ఇలా రకరకాల వారు నేటి సమాజంలో పెరిగిపోతున్నారు.

ఎవరూలేక.. తప్పక...



బుద్ధారి పద్మ, కారంచేడు

భర్త కొంతకాలం కిందట చనిపోయారు. సంతానం లేరు. వయసు పైబడింది. నా అనేవారు లేక తప్పక ఆశ్రమంలో చేరాను. బాధలోనే ఆనందాన్ని వెతుక్కొని ఇక్కడ అందరితో ఉంటున్నా.

చూసేవాళ్లు లేక...



దాసరి సుమిత్ర, ఇంటూరు, గుంటూరు జిల్లా

నా భర్త చనిపోయారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కుమార్తెకు ప్రేమ ఉన్నా చూసే స్తోమత లేదు. కుమారులకు వీలు కుదరడం లేదు. అందరూ ఉన్నా అనాథగా ఇక్కడున్నాను.

చక్కగా ఆదరిస్తున్నారు



తుమ్మల భవానీశంకర్, పొన్నూరు

వైకల్యం కారణంతో పెళ్లి కాలేదు. కాలక్రమేణా అమ్మా, నాన్న మరణించారు. చూసే వారు లేక ఆశ్రమంలో చేరా. ఇక్కడ సమయానికి ఉచితంగా భోజనం పెడుతున్నారు. అవసరం మేరకు మందులు ఇస్తున్నారు. అందరితో ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు ఓ పెద్ద కుటుంబం ఉందన్న భావనతో బతుకుతున్నా.

సోదరితో కొంచెం అలక



అన్నం లక్ష్మీకాంతం, చెరుకుపల్లి

మేము 9 మంది అక్కాచెల్లెళ్లం, నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అందరూ రోజువారీ కూలీలే. ఎవరికీ భారం కాకూడదని ఆశ్రమంలో చేరా. వాళ్లు గుర్తుకు వస్తే ఏడుపు వస్తుంది. అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడేదానిని. రెండేళ్ల కిందట మా చెల్లెలు నాకు ఇష్టం లేని సంబంధంతో కుమారుడికి పెళ్లి చేసిందని ఫోన్ మాట్లాడడం మానేశా.

ఆశ్రమాల్లో ఆనందం

ఆశ్రమాల్లో చేరిన వారు కొంతమేర ఆనందంగా ఉంటున్నారు. విధి వారిని వంచించి ఆశ్రమాలకు పరిమితం చేస్తుంటే నిర్వాహకులు వారికి కల్పించే ఆదరణ, అంతా ఒకరి బాధలు ఒకరికి చెప్పుకుని దగ్గరవుతున్నారు. ఈ క్రమంలోనే అందరూ కలిసి భోజనం చేయడం, మంచిగా ముచ్చట్లు చెప్పుకుంటూ, ఆ పాత మధురాలు చిత్రాలను టీవీల ద్వారా వీక్షిస్తు ఆనందిస్తున్నారు. ఈక్రమంలో కుటుంబాలకు దూరమైన వారికి ఒకింత ఆశ్రమాలు ఎంతో ఉపయోగకరమనే చెప్పాలి.


అంతా ఒకేచోట కూర్చుని టీవీ చూస్తున్న వృద్ధులు

● గణనీయంగా పెరుగుతున్న వృద్ధాశ్రమాలు

వయోప్రాయంలో ఉన్న తల్లిదండ్రులు కొందరికి తప్పక, మరి కొందరికి భారంగా భావించి ఒంటరిగా వదిలేయడమో లేక ఆశ్రమాల్లో చేర్పడం వంటివి చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో వృద్ధాశ్రమాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. కని, అల్లారు ముద్దులా పెంచి ప్రయోజకుల్ని చేస్తుంటే, వయోప్రాయంలో ఉన్న తల్లిదండ్రుల యోగక్షేమాలు, ఆలనాపాలనా చూడాల్సిందిపోయి, గాలికి వదిలి ఒక్కసారిగా తెగిన గాలిపటంలా ఏకాకుల్ని చేసి ఆశ్రమాల్లోకి పంపుతున్నారు. యోగ క్షేమాలు చూసేవారు లేక ఆశ్రమాల్లో చేరితే పర్వాలేదు గానీ, అన్ని ఉండి, అందరూ ఉండి కూడా ఆశ్రమాల్లో ఏకాకులవుతున్న వారి పరిస్థితి దయనీయం. ఈ క్రమంలో అనాథల్లా ఉన్న వృద్ధులకు ఆశ్రమాలు నీడ నివ్వడం ఒకింత మంచిదే అయినా, అందరూ ఉండి ఆశ్రమాల్లో చేర్పడం బాధాకరమని కొందరు అంటున్నారు. చీరాల పరిధిలో సుమారు 5 ఆశ్రమాలు ఉండగా అన్నింట్లో కలుపుకుని సుమారు 300 మందికిపై వృద్ధులు కాలాన్ని గడుపుతున్నారు.

ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలి

పోలీసులకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశం

పొదిలిలో సీఐ కార్యాలయం ప్రారంభం


సీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

పొదిలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. పొదిలిలో నూతన హంగులతో తీర్చిదిద్దిన సీఐ కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. 1940వ సంవత్సరం, బ్రిటిష్ కాలం నాటి చారిత్రాత్మకమైన 85 సంవత్సరాల నాటి ఈ పాత పోలీస్‌స్టేషన్‌ను ఆధునికీకరించారు. దీనిలో భాగంగా సర్కిల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన నూతన ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రజల సౌకర్యార్థం వెయిటింగ్ హాలు, ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం, సిబ్బందికి విశ్రాంతి గది, ఇతర సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ కార్యాలయం ఆధునిక, సాంకేతిక సేవలతో అదుబాటులో ఉంచినట్లు తెలిపారు. సౌకర్యవంతమైన వాతావరణంతో సిబ్బందికి మెరుగైన పనివాతావరణాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కాలంతో పాటు మారుతున్న నేరాల స్వభావాన్ని అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా, ఓపికగా వ్యవహరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో నూతన పద్ధతులను అవలంబించాలన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయంపై జాతీయజెండాను ఎగురవేశారు.

సీసీ కెమెరాల అందజేత

మహిళా పోలీస్ నాగలక్ష్మీ జిల్లా ఎస్పీకి నాలుగు సీసీ కెమెరాలు అందజేశారు. ఆమెను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మహిళాదినోత్సవం పురస్కరించుకొని వారోత్సవాల్లో జిల్లాలో అన్నీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఓపెన్ హౌస్, మెడికల్ క్యాంపులు, యోగా స్కూల్స్, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు, మహిళల హక్కులను తెలియజేసేలా అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడీషనల్ ఎస్పీ అశోక్‌బాబు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పొదిలి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ వేమన, పలువురు సీఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్‌బియ్యం లారీలను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

నాగులుప్పలపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న రెండు లారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సీఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి తమ సిబ్బందితో ఆదివారం తెల్లవారుజామున నాగులుప్పలపాడు సమీపంలో ఇంకొల్లు జంక్షన్‌వద్ద జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల నుంచి నెల్లూరుకు రెండు లారీలలో గోతాలు మార్చని 700 బస్తాల రేషన్‌బియ్యం తరలిస్తుండగా పట్టుకొన్నారు. రేషన్‌బియ్యం బస్తాలను ఒంగోలులోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. లారీ డ్రైవర్ల సమాచారం మేరకు అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న వంశీరెడ్డితో పాటు కావలికి చెందిన వాహన యజమానులైన శామ్యూల్, మాల్యాద్రిలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

ఒంగోలు క్రైం, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ వ్యభిచార గృహంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ముగ్గురు విటులు, నలుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీతారామపురంలోని హిల్‌టవర్‌పై ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతుందనే సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు పి.నాగరాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

వైభవంగా శ్రీమూలస్థానేశ్వరస్వామి కల్యాణం


స్వామికి కల్యాణం చేస్తున్న పురోహితులు

ఒంగోలు(రూరల్), మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని త్రోవగుంట గ్రామంలో శ్రీగంగా పార్వతి సమేత శ్రీమూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితులు ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ క్రతువును కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయన ప్రధాన అర్చకుడు ఆమంచి ఉదయభాస్కర్ ఉద్బోధిస్తూ స్వామివారి కల్యాణం తిలకించిన భక్తుల పాపాలు హరించిపోతాయన్నారు. లోక కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా అన్నదాన ప్రసాదం వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చెత్తబండి దహనంపై ఫిర్యాదు

జరుగుమల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామేపల్లిలో గ్రామ సచివాలయం వెలుపల ఉంచిన చెత్తబండికి గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించి దహనం చేసిన ఘటన శనివారం రాత్రి జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, దహనం చేయడం నేరమన్నారు. ఆ మేరకు జరుగుమల్లి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశామని తెలిపారు.

10 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కౌశల్ కిషోర్‌ను ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి ఆదివారం తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించినా, అక్రమంగా మద్యం విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నిబంధనలు కఠినతరం అనుమతులు సరళతరం

భవన నిర్మాణాలపై కొత్త జీవోలు విడుదల

మార్గదర్శకాలు పాటిస్తేనే ఆక్యుపెన్సీ

టౌన్‌ప్లానింగ్‌లో చేతివాటానికి చెక్

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) :నగరాలు, మున్సిపాలిటీలలో భవన నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాణ నిబంధనలు కఠినతరం చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలను కట్టడి చేసేందుకు, నిర్మాణ అనుమతులను సరళతరం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం. 3, 4, 5, 20లను జారీ చేసింది. ఈ జీవోలతో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే ప్లాన్ అనుమతులు ఇస్తామని ఇటీవల పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. తాజా ఉత్వర్వుల్లో అనుమతులు లేకుండా చేపట్టిన భవన నిర్మాణాలతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా, ప్లాన్‌కు భిన్నంగా చేపట్టే నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. భవన నిర్మాణ అనుమతులపై జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం 300 చదరపు మీటర్లు మించని భవన నిర్మాణాలకు యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే గతంలో లే అవుట్ రోడ్లకు 12 మీటర్లు ఉండగా, ఇపుడు దానిని 9 మీటర్లకు తగ్గించారు. అలాగే 500 చదరపు మీటర్లపైన స్థలాల్లో నిర్మించే నిర్మాణానికి సెల్లార్‌కు అనుమతులు ఇచ్చారు. అపార్ట్‌మెంట్ నిర్మాణాల విషయంలో, సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పు చేసిన ప్రభుత్వం టీడీఆర్ బాండ్‌లు జారీ చేసే కమిటీ నుంచి రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లను తొలగించింది. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది. ఇక భవన నిర్మాణాల అనుమతుల కోసం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు ఇంటి ప్లాన్ ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి అనుమతి పొందేలా అవకాశం ఇచ్చారు. ఈ మేరకు పోర్టల్‌లో [illegible] ఆప్షన్ మార్చారు.


ఒంగోలు నగరం వ్యూ

టౌన్‌ప్లానింగ్ చేతివాటానికి చెక్

మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో భవన నిర్మాణ అనుమతులు అంటే ముడుపులతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఏ ఫీజు ఎంత ? అనే వివరాలు ఇప్పటి వరకు ఎవరికీ తెలిసేవి కావు. టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పినంత చెల్లించాల్సిందే. నిర్ణీత ఫీజులు చెల్లించినా టౌన్‌ప్లానింగ్ అధికారులను ప్రసన్నం చేసుకోకపోతే వారిని ముప్పుతిప్పలు పెడతారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దగ్గర నుంచి దానికి ఫీజులు జనరేట్ అయ్యే వరకు రకరకాల కొర్రీలు వేసి కాలయాపన చేయడం అందరికీ తెలిసిన విషయమే. అయితే ఇక ఖాళీ స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకు ఆ స్థలం కొన్నప్పటి నుంచి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) వసూలు చేస్తారు. మధ్యలో ఎందరి చేతులు మారినా అది రికార్డుల్లోకి ఎక్కినప్పటి నుంచి నిర్మాణదారులు పన్నులు చెల్లించాల్సి వస్తుంది. భవన నిర్మాణాలు పూర్తయి, అవి అమ్ముడు పోయే వరకు ఖాళీగా ఉన్న కాలానికి కూడా పన్నులు వసూలు చేసేవారు. వీటన్నింటికీ చెక్‌పెడుతూ కూటమి ప్రభుత్వం గృహ యజమానికి సేవలను మరింత సులభతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో సామాన్యుల సొంతింటి కల నెరవేరనుంది.

ప్లాన్ ఫాలో అయితేనే ఆక్యుపెన్సీ..

- భవన నిర్మాణాలకు అనుమతించే సమయంలో కార్పొరేషన్‌ల పరిధిలో ముందుగానే నిర్ణీత స్థలాన్ని ప్రభుత్వానికి తనఖా పెట్టాల్సి ఉంటుంది. అనుమతించిన ప్లాన్ మేరకు నిర్మాణం పూర్తయితే ఆ భవనాలకు మార్టిగేజ్ రిలీజ్ చేస్తారు. ఆ తర్వాత మునిసిపల్ కార్పొరేషన్, పట్టణాల్లో టౌన్ ప్లానింగ్ విభాగాలు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తాయి.
- ప్లాన్ అనుమతి పొందే సమయంలోనే భవన నిర్మాణదారులతో స్థానిక సంస్థలు ఒప్పందం చేయాల్సి ఉంటుంది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిన తర్వాతే భవనంలోకి నివాస యోగ్యత లభిస్తుంది.
- భవన నిర్మాణం పూర్తియ్యే వరకు బిల్డింగ్ ప్లాన్ కాపీ నిర్మాణ ప్రాంతంలో తప్పనిసరిగా ప్రదర్శించాలి. నిర్మాణ సమయంలో ఉల్లంఘనలు జరగకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పడు తనిఖీ చేయాలి.
- నిర్మాణంలో అనుమతించిన ప్లాన్ మేరకు ఒప్పందాలను, నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తిస్తే అలాంటి వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ నిలిపివేయాలి. ఇందుకు బాధ్యులైన సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన తర్వాతే సంబంధిత భవనాలకు తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని తాజా ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాల్లో వ్యాపారాల నిర్వహణకు ట్రేడ్ బిజినెస్ లైసెన్సులు జారీ చేయకూడదని జీవోలో పేర్కొన్నారు.
- టౌన్‌ప్లానింగ్ అభ్యంతరాలపై సంబంధిత యజమానులు చేసే అప్పీళ్లను 90 రోజుల్లోగా కమిషనర్లు పరిష్కరించాలని ఆ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

ఒంగోలు క్రైం, మార్చి2(ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం జరిగింది. పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఇష్టంరాజుపల్లికి చెందిన చేవూరి నాగేంద్రం(85) ఆర్టీసీ బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళుతుండగా బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను స్థానిక రిమ్స్‌కు తరలించగా అక్కడ వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ

సెలవు రోజుల్లోనూ పన్నుల చెల్లింపునకు అవకాశం

గిద్దలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి పన్నులు చెల్లించేవారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్ ఉదయం 9గంటల నుండి రాత్రి 7గంటల వరకు తెరచి ఉంటుందని పేర్కొన్నారు. సెలవు దినాలు, ఆదివారాలు, పండుగ రోజుల్లో కూడా పన్నులు చెల్లించేందుకు వీలుగా క్యాష్ కౌంటర్ తెరచి ఉంటుందని, ఈఅవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్ఎస్ఎస్ సమావేశం



సమావేశమైన వివిధ సంఘాల ప్రతినిధులు

గిద్దలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవ సన్నాహక సమావేశం పట్టణంలోని రామకృష్ణ మఠంలో నిర్వహించారు. ఈనెల 16న జరుగనున్న వార్షికోత్సవ సమావేశానికి హిందువులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. సమావేశానికి సంబంధించిన బాధ్యతల గురించి వివిధ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. సమావేశానికి ప్రతి హిందువు హాజరుకావాలని ఆర్ఎస్ఎస్ సంపర్క్ రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శివమల్లారెడ్డి, సమరసత ఫౌండేషన్ కన్వీనర్ ఏనుగుల పద్మావతి, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్ శంకర్, జిల్లాశాఖ ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

పుల్లలచెరువు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఉపాధి హామీ పథకం కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొత్తూరుకు చెందిన దండేబోయిన కోటేశ్వరరావు(40) ఎర్రగొండపాలెంలో ఉపాధిహామీ పథకం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటి ఆర్వో ప్లాంటులో నీరు వచ్చే పంప్ మోటారు స్విచ్ఛాఫ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్లాగ్‌కు విద్యుత్‌సరఫరా అయ్యి కోటేశ్వరరావు షాకుకు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రెండేళ్ల క్రితం ఈయన భార్య కూడా అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తల్లిదండ్రులు లేకపోవడంతో వారు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఎర్రగొండపాలెం వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

అరకొర నిధులతో వెలిగొండ పూర్తి ఎలా?

కొండపి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులతో వెలుగొండ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కొండపిలోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, సీపీఎం జిల్లా నాయకురాలు కంకణాల రమాదేవి, వి.మోజెస్, సీపీఎం మండ ల కార్యదర్శి మల్లెల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాశివునికి భృంగి వాహనసేవ

- మార్కండేశ్వరుని ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



భృంగివాహనంపై పరమశివుడు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజశర్మలు మార్కండేశ్వరస్వామి, జగదాంబలకు ఆదివారం అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం భృంగీశ్వర వాహనంపై జబాఝూతా మహేశ్వర అలంకారంలో నగరోత్సవం నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పోలేరమ్మకు ఉగాది జాతర ప్రారంభం

మార్కాపురంలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఉగాది ముందు వచ్చే ఐదు వారాల జాతర ఆదివారం ప్రారంభమైంది. ఇక్కడి పోలేరమ్మ ఆలయానికి డివిజన్‌లోనే కాక రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భక్తులు ఉన్నారు. అల్లూరమ్మ, అల్లూరయ్య అనే పేర్లు పెట్టుకుని అమ్మవారిని కొలుస్తారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు పడి పంటలు పండాలని తమ వ్యక్తిగత అవసరాలు తీరాలని, కుటుంబ సంక్షేమం కోసం అమ్మవారికి మొక్కుకొని కొలుస్తారు. ఆదివారం అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగదేవతలకు పూజలు నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పోలేరమ్మ ఉత్సవ కమిటీ నాయకులు దొడ్డా రవికుమార్, రామాంజనేయులు, మట్టం శ్రీనివాసులు, వన్నెబోయిన బ్రహ్మం, గుమ్మా అంకయ్య, శ్రీనివాసులరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జవహర్‌నగర్ కాలనీలో వెలసిన ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు అఖండ జ్యోతి ప్రజ్వలన, బ్రహ్మోత్సవ అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు డా. డీవీ.కృష్ణారెడ్డి, వై.సత్యనారాయణరెడ్డి, జి.వెంకటరెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, యోగిరెడ్డి, మహిళా సేవాసమితి, వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.





విశేష అలంకరణలో పోలేరమ్మ, అమ్మవారి దర్శనానికి హాజరైన భక్తులు, లక్ష్మీనారాయణుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులు అందజేస్తున్న నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమం కోసం ఆ పార్టీ అదినేత సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు భారీగా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆ సభ్యత్వ నమోదుకు సంబంధించిన కార్డులను ఆదివారం నాయకులు కార్డుదారులకు అందజేశారు. పట్టణంలోని తెలుగుయువత ఆధ్వర్యంలో 27, 28, 29, 30 వార్డులలో సభ్యత్వ నమోదు కార్డులను అందజేసి సభ్యత్వం వలన కలిగే లాభాలను వివరించారు. ఆయా క్యార్యక్రమాలలో మూడమంచు శ్రీనివాస యాదవ్, చేదూరి కిషోర్, ఆతుకూరి కృష్ణయ్య, కొర్రపోలు యోహాను, దాసు, థామస్, వెంకట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబంపై దాడి కేసులో 13 మంది అరెస్టు

- 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయస్థానం

పుల్లలచెరువు,మార్చి2(ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని ఒక కుటుంబంపై దాడి చేసిన కేసులో 13 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ముటుకుల గ్రామానికి చెందిన యరదేశి వెంకటేశ్వర్లు, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచిన, యరదేశి మణికంఠతో పాటు మరో 12 మందిని అరెస్టు చేశారు. శనివారం వీరిని మార్కాపురం న్యాయవస్థానం ఎదుట హాజరు పరచగా, వారికి న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

గిద్దలూరుటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గృహవిద్యుత్ వినియోగదారులు తాము వినియోగిస్తున్న అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రోజు నుండి జూన్ 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో గాని, విద్యుత్ ఉపకేంద్రం లోని అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీ రూ.2000 కట్టేవారని, ఈ స్కీమ్ కింద రూ.1000 కడితే చాలని తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం కనెక్షన్ తీసుకున్న వారికి వినియోగం అప్పటితో పోలిస్తే మూడు, నాలుగు ఇంతలు పెరిగి ఉంటుందన్నారు. ఈ అదనపు లోడుతో సమస్య నెలకొందన్నారు. తనిఖీల సమయంలో అధిక లోడు వినియోగిస్తున్నట్లు సిబ్బంది గుర్తిస్తే జరిమానా విధిస్తారన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



పదో తరగతి విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 2 ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాచవరం ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ మల్లికార్జునరావు పరీక్షా విధానాలు, సన్నద్ధం అయ్యే విధంగా ప్రేరణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య, ఏఓ రంజిత్ కుమార్ పాల్గొన్నారు. సాయి చైతన్య హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు నిర్వహించారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు పాటించే ఉపవాస దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముస్లింలు ఉపవాస దీక్షలు పాటిస్తూ, ఐదు పూటలా నమాజ్ చదువుతూ ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ నెలంతా గడుపుతారు. వేకువ జామున 5.00 గంటలకు ఆహార పానియాలు స్వీకరించి సాయంత్రం వరకు ఉపవాసం దీక్షలు పాటిస్తారు. ఈ సమయంలో కనీసం మంచినీటిని కూడా ముట్టరు. సాయంత్రం ఉపవాస దీక్షల అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొంటారు. నమాజులు చదువుతూ, ఖురాన్ పఠనం చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. పేదలకు, బంధువులకు ధానధర్మాలు చేస్తారు. పట్టణంలోని అన్ని మసీదుల్లో రంజాన్ వాతావరణం నెలకొంది.

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సోమయ్య

పెద్దదోర్నాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా జీవనాడి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం 2వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీ సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆది వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువుతో అల్లాడుతున్న ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టు ముప్పై ఏండ్లుగా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశామని చెప్పి పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా బడ్జెట్టులో కేవలం రూ.359 కోట్లు కేటాయిస్తే పనులు ఎన్నాళ్లకు పూర్తవుతాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టు వెలిగొండని ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కోరారు. జిల్లా పశ్చిమ ప్రాంతం ఎమ్మెల్యేలు, ఎంపీలు వివిధ ప్రజా ప్రతినిధులకు ఈ ప్రాంతం అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కృష్ణా నీటిని మొదటి సొరంగం ద్వారా తీసుకురావాలని లేనిపక్షంలో ప్రజావ్యతిరేకతను ఎదుర్కోవాలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, దావీద్, ఏసోబు, పీ.పిచ్చయ్య, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో తగినన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేదని ఆరోపిస్తూ సిపిఎం నాయకులు బడ్జెట్ ప్రతు లను దహనం చేశారు. స్థానిక పొట్టి శ్రీరాము లు విగ్రహం కూడలిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీపీఎం నేత ఆవులయ్య మాట్లాడుతూ, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు, నిర్వాసితులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కనీసం 2వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చి ఉంటే నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజ్ పూర్తయ్యేదన్నారు. ప్రాజెక్టులోకి నీళ్ళు వచ్చేవని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు అల్లూరుస్వామి, శ్రీనివాసులు, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేసిన వ్యక్తి వెంకటేశ్వర్లు

గిద్దలూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విరమణ చేసే వరకు విధి నిర్వహణలో ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు బాధ్యతాయుతంగా ఉన్నారని, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. గత నెల ఉద్యోగ విరమణ చేసిన గిద్దలూరు ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు ఆత్మీయ అభినందన సభ స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకిశోర్‌రెడ్డి జింకా వెంకటేశ్వర్లును అభినందించారు. ఎంఈవోగా తన హోదాకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మరో ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, యూటీఎఫ్, దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 1708 మందికి వైద్యసేవలు పొందారు. వైద్యులు బి.హరిబాబు, జా న్‌రిచర్డ్, చాపల వంశీకృష్ణ, ఎం.శరత్, సుందర్‌బాబు, రంజిత్‌బాషాలు వైద్య సేవలను అందించారు. రూ.400లకే నాలుగు నెలలకు సరిపడా మందులను అందజేశారు. రోగులకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తున్నట్లు మెడిక ల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు నిర్వహణకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ జవహ ర్‌కు, ఢాకా సుబ్బారెడ్డి, రూ.2వేలు సహాయం అందజేసిన రిటైర్డ్ హెచ్‌ఎం కనపర్తి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే పనుల్లో నాణ్యత డొల్ల

- నాసిరకంగా గూడ్స్ ట్రాక్ పనులు
- పలకల బెచ్చలతో ట్రాక్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు



పలకల క్వారీల్లోని వేస్టేజీతో నిర్మిస్తున్న గూడ్స్ రైల్వే ట్రాక్

మార్కాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖకు చెందిన నిర్మాణ పనులంటే నాణ్యతకు చిరునామాగా ఉంటాయి. ఎలాంటి చిన్నపాటి పని చేపట్టినా నిరంతరం ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. ఎటువంటి సామగ్రి వినియోగించాలన్నా, ముందుగా క్యాలిటీ కంట్రోల్ చెకప్‌లు పూర్తయితేనే ముందుకు సాగేది. అయితే మార్కాపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న గూడ్స్ ట్రాక్ పనులు మాత్రం అత్యంత నాసిరకంగా సాగుతున్నాయి. రూ.6 కోట్లతో జరుగుతున్న నూతన గూడ్స్ ట్రాక్ నిర్మాణంలో మాత్రం నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. నాణ్యత ఉన్న గ్రావెల్‌తో అత్యంత పటిష్టంగా చేయాల్సిన ట్రాక్ పనులు స్థానికంగా ఎలాంటి క్వాలిటీ ఉండని పలకల బెచ్చలతో నిర్మిస్తున్నారు. కిందిభాగంలో పలకల రద్దు వేసి పైన కొంతమేర గ్రావెల్ పరిచి ట్రాక్ పనులను మమ అనిపిస్తున్నారు. పనుల్లో డొల్లతనం ప్రత్యక్షంగా కనిపిస్తున్నా రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం వెనుక అంతరార్థం ఏంటో అర్థంకాకుండా ఉంది.

పలకల మట్టిపోసి కనికట్టు చేసి

మార్కాపురం రోడ్డు రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ కింద ఎంపిక చేశారు. స్టేషన్‌ను పూర్తిస్థాయిలో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.21 కోట్ల నిధులు కేటాయించారు. అందులో భాగంగా మూడు ప్లాట్ ఫామ్‌ల ఆధునికీకరణ, రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, నాలుగు ప్రాంతాల్లో లిఫ్టులు, పాత రైల్వేస్టేషన్ స్థానంలో నూతన నిర్మాణాలు, అధునాతన డార్మిటరీలు, అదనంగా రెండు ట్రాక్‌లు, కోచ్ ఇండికేటర్‌లు తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఇవేకాకుండా, రైల్వేశాఖ రూ.6 కోట్లతో అదనంగా గూడ్స్ ట్రాక్ నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఆ పనులు దక్కించుకున్న గుత్తేదారు హడావుడిగా నిర్మాణం పూర్తి చేశాడు. ముఖ్యంగా నూతన ట్రాక్ నిర్మించాలంటే ముందుగా అక్కడ వినియోగించాల్సిన గ్రావెల్‌కు క్వాలిటీ కంట్రోల్ అధికారులు అనుమతి ఇవ్వాలి. మొరస మట్టితో ట్రాక్ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా, సమీపంలోనే పలకల క్వారీల వద్ద ఎలాంటి ఖర్చు లేకుండా దొరుకుతున్న వేస్టేజీని సుమారు 7 అడుగుల మేర ట్రాక్ ఏర్పాటుకు ఉపయోగిస్తున్నారు. ఆపైన ఒక అడుగు మేర మాత్రమే నాణ్యమైన మొరసమట్టిని వేస్తున్నారు. కింద భాగంలో ఉన్న పలకల వేస్టేజీని ఇలాంటి కీలకమైన నిర్మాణాలకు ఎవరూ ఉపయోగించరు. కానీ కాంట్రాక్టర్ కక్కుర్తితో రూ.కోట్లు అక్రమంగా సంపాదించేందుకు నాణ్యతలేని పలకల క్వారీల్లోని వేస్టేజీని పోసి ట్రాక్ నిర్మాణం చేస్తున్నాడు. అంతేకాక ట్రాక్ పనులు చేసేటప్పుడు భవిష్యత్తులో కుంగిపోకుండా రెండు అడుగులకు ఒక లేయర్ చొప్పున అధునాతన రోలర్‌లతో తొక్కించాల్సి ఉంది. కానీ ఎలాంటి రోలర్‌ను ఉపయోగించకుండానే గూడ్స్ ట్రాక్ పనులను మమ అనిపిస్తున్నాడు. ఈ విషయమై గుంటూరు డీఆర్ఎం కార్యాలయంలోని రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారి నోయల్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే ట్రాక్ పనులను పరిశీలించి నాణ్యతలేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.




క్వారీవేస్టును టిప్పర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్‌వద్ద అన్‌లోడ్‌కు సిద్ధంగా ఉన్న టిప్పర్


అస్తవ్యస్తంగా సాగునీటి పంపిణీ

» మేజర్లు, మైనర్లకు అందని నీరు
» ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

దర్శి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. సాగర్ కాలువలకు నీటి సరఫరా తగ్గిపోవటంతో మేజర్లు, మైనర్లకు నీరు అందటం లేదు. చివరి భూములకు నీరందక పైర్లు వాడుముఖం పట్టాయి. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళనలు చెందుతున్నారు. రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పైరుకు కూడా నీరందటం లేదు. దీంతో పంట దెబ్బతింటుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ డ్యామ్‌లో నీటి పరిమాణం తగ్గటంతో కాలువలకు నీటి సరఫరాను తగ్గించారు. అధికారుల లెక్కల ప్రకారం సాగర్ కుడికాలువకు 6006 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అక్కడినుంచి ప్రకాశం సరిహద్దుకు చేరేసరికి జిల్లాకు అరకొరగానే నీరు విడుదలవుతుంది. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు (ప్రకాశం బార్డర్)కు కేవలం 1918 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి దిగువకు వచ్చేసరికి పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 470 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 357 క్యూసెక్కుల నీరు మాత్రమే పంపిణీ అవుతుంది. సుమారు 1.7 లక్షల ఆయకట్టు భూమి ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు (ఓబీసీ) నామమాత్రంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ఓబీసీ పరిధిలోని మేజర్లు, మైనర్లకు నీరు అందటం లేదు. ప్రధానంగా ఎర్రోబనపల్లి, నిప్పట్లపాడు, లక్కవరం తదితర మేజర్లకు అసలు నీరు అందటం లేదు. ఆ మేజర్ల కింద ఉన్న చివరి భూములకు చుక్కనీరు అందక అన్నదాతలు అల్లాడుతున్నారు. ఎర్రోబనపల్లి మేజర్ కింద పంటకు వచ్చిన వరిపైరు ఉంది. అలాగే, రబీ సీజన్‌లో సాగుచేసిన వరి వెన్నుతీసే దశలో ఉంది. వరి పైరుకు నీరు పుష్కలంగా అవసరమైన సమయంలో మేజర్లకు నీరు అందకపోవటంతో పైరు దెబ్బతింటుదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తూర్పుచౌటపాలెం, సామంతపూడి, వీరాయపాలెం, రాజంపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన మొక్క జొన్న, మినుము తది తర పైర్లు నీరందక వడిపడుతున్నాయి. సాగు నీరు సక్రమంగా విడుదల చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంటుంది.


ఎర్రోబనపల్లి మేజర్ కింద సాగవుతున్న వరిపైరు


ఓబీసీ హెడ్‌వద్ద అతి తక్కువగా సరఫరా అవుతున్న సాగర్ నీరు


ఎర్రోబనపల్లి మేజర్‌కు నిలిచిపోయిన నీటి సరఫరా


చుక్కనీరు లేని దీక్షితులువారిపాలెం మైనర్ కాలువ

వారబందీతో నీటి కష్టాలు

ముండ్లమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌పీ అధికారులు రెండు వారాల క్రితం వారబందీ ప్రవేశపెట్టారు. దీంతో రైతులకు నీటి కష్టాలు ఏర్పడ్డాయి. ముండ్లమూరు మండలంలోని రజానగరం, మోదేపల్లి మేజర్ కాలువల పరిధిలో వరి, మొక్కజొన్న, పొగాకు సాగుచేస్తున్నారు. రజానగరం మేజరు పరిధిలో దీక్షితులవారిపాలెం మైనర్ కింద కమ్మవారిపాలెం, చింతలపూడి, చిన్న ఉల్లగల్లు గ్రామాలకు చెందిన రైతులు వరి పైరును సాగు చేశారు. ప్రస్తుతం వరి పైరు పొట్టదశలో ఉండగా నీటి ఎద్దడి ఏర్పడింది. ఇప్పటికే ఎకరానికి రూ.20వేలు నుంచి రూ.30వేలు వరకు పెట్టుబడులు పెట్టారు. పైరు పొట్ట దశలో ఉండటమే కాక ఎదుగుదశలో ఉన్న సమయంలో నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో నీటి తడులకు రైతులు పడరాని కష్టాలు పడుతున్నారు.

రజానగర్ మేజరు పరిధిలోనూ పసుపుగల్లు, సింగనపాలెం, చంద్రగిరి మైనర్ కాలువల పరిధిలో వరి పైరుకు నీరందక ఎండు మొఖం పట్టింది. దాదాపు రెండు వందల ఎకరాలకు పైగానే ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. సాగర్ జలాలు ఎగువ ప్రాంతం భూముల వరకే నీరు సరిపోతుంది. రెండు వారాల నుంచి వారబందీతో కాలువలు పూర్తిగా ఎండిపోయాయి. సక్రమంగా సాగునీరు సరఫరా చేసి పైర్లను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న, వైట్‌బర్లికీ అదేతీరు..

వరి పైరుకే కాకుండా మొక్కజొన్న, వైట్‌బర్లీ సాగు చేసిన రైతులకు నీటి కష్టాలు తప్పటం లేదు. మోదేపల్లి, రజానగరం మేజరు పరిధిలోని సాగర్ చవరి భూముల్లో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న, వైట్ బర్లి పొగాకు సాగు చేశారు. ప్రస్తుతం పైరు ఆశాజనకంగా ఉంది. ఈ పరిస్థితుల్లో నీరు అవసరం ఏర్పడింది. ఎన్‌ఎస్‌పీ అధికారులు వారబందీ పెట్టడంతో ఎండుముఖం పట్టాయి.

వరి పైరుకు నీరుపెట్టి రెండు వారాలైంది

- కాటూరి శ్రీను, చింతలపూడి



దీక్షితులవారిపాలెం మైనర్ కాలువ పరిధిలో నాలుగు ఎకరాల్లో వరిపైరు సాగు చేస్తున్నాను. ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా నీటిఎద్దడి ఏర్పడింది. రెండు వారాల క్రితం నీరు పెట్టాను. మరలా నీరు పెట్టాలంటే వారాబందీ విధానంతో నీరు రావటం లేదు. దీంతో దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఏర్పడింది. అధికారులు స్పందించి సక్రమంగా సాగునీరు సరఫరా చేసి పంటలను కాపాడాలి.

దిగుబడులపై తీవ్ర ప్రభావం

దామా వెంకటేశ్వర్లు, చింతలపూడి

ఐదు ఎకరాల్లో వరి పైరు సాగుచేస్తున్నాను. పైరు బాగా ఎదుగుదలకు వచ్చి పొట్ట దశలో ఉంది. ఒక్కసారిగా నీరు కాలువలకు ఆగి పోవటంతో నీటి ఎద్దడి ఏర్పడింది. 20 రోజుల నుంచి చుక్క నీరు కూడా రావటం లేదు.

దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పంట కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి. వారబందీ విధానం ఎత్తివేసి సాగర్ జాలాలను విడుదలచేసి పంటలను కాపాడాలి.

పాలేటిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి

పీసీపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పాలేటిపల్లి చెరువు కాలువల నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివా రం పీసీపల్లిలో నిరసన చేపట్టారు. పీసీపల్లి మండలానికి సాగు, తాగునీటికి ప్రయోజనకరంగా ఉండే పాలేటిపల్లి రిజర్వాయర్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించాలని రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సుమారు 13 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో చెరువు నిర్మాణం చేపట్టినట్లు రైతుసంఘం నాయకుడు మాలకొండయ్య అన్నారు. ఆతరువాత వచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు కనీసం చెరువుకు కాలువలు కూడా తీయించ లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి చెరువుకు కాలువలు తీయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, మాలకొండయ్య, చినమాలకొండయ్య, కొండయ్య, వీరస్వామి, స్టీఫెన్, నాగార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదిదంపతులను అభిషేకించిన భానుడు

కురిచేడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో గత రెండు రోజుల నుంచి సూర్య భగవానుడు స్వామి వార్లను తాకుతూ అభిషేకిస్తున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలం, దక్షిణాయన పుణ్యకాలం వచ్చిన తరువాత భానుడు శివుడు, అమ్మవార్లను తాకుతుంటాయి. ఆలయం గర్భగుడికి బయటకు 30 అడుగుల దూరం ఉంటుంది. అంతదూరం నుంచి స్వామి, అమ్మవార్లను సూర్య భగవానుడు స్పృశిస్తూ పునీతుడవుతున్నారు.

ఉదయాన్నే భానుడి లేలేత కిరణాలు శివలింగం తాకుతున్నాయి. అమ్మవారిని సైతం సూర్యుడు అభిషేకిస్తున్నారు. వారం రోజుల పాటు ఇలా జరుగుతుందని ఆలయ అర్చకులు కురిచేటి ఆదిశేషయ్య తెలిపారు. సంవత్సరంలో రెండు సార్లు ఇలా సంభవిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సుందర దృశ్యాన్ని తిలకిచడానికి భక్తులు ఉదయాన్నే ఆలయానికి వస్తున్నారు.


జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని తాకుతున్న భానుడి కిరణాలు


శివుడిని అభిషేకిస్తున్న సూర్య భగవానుడి కిరణాలు

ముగిసిన అడవి పేరంటాలమ్మ తిరునాళ్ల

పీసీపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుగుమ్మి గ్రామంలో మూడురోజులుగా జరుగుతున్న అడవి పేరంటాలమ్మ తిరునాళ్ల ఆదివారంతో ముగిసింది. గ్రామానికి దూరంగా అడవికి సమీపంలో కొలువై ఉన్న పేరంటాలమ్మను శుక్రవారం అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉన్న పేరంటాలమ్మ గుడికి అమ్మవారి మూలవిరాట్‌ను తీసుకు వచ్చారు. శనివారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు వారుపోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆదివారం పేరంటాలమ్మ గుడి ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నేరేడుపల్లి, జంగాలపల్లి, మురుగుమ్మి గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పూసలబండ్లు కట్టించి గుడిచుట్టూ తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు. పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

క్రీడారంగం అభివృద్ధికి కృషి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో కనిగిరి ప్రముఖ స్థానంలో నిల వాలన్నదే తన ఆశయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆది వారం స్థానిక రాజా ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ళ క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కని గిరిలో రాష్ట్రస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించినట్లు గుర్తు చేశారు. కనిగిరి ప్రాంతానికి చెందిన యువతీ, యువకులు అన్నిరకాల క్రీడల్లో ఆసక్తి కనపరచి మంచి క్రీడాకారులుగా తయారుకావాలన్నారు. కనిగిరి ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు స్టేడియంలు నిర్మాణం కూడా తలపెట్టినట్లు చెప్పారు. ఆతర్వాత వచ్చిన పా లకులు ఆయా స్టేడియంల అభివృద్ధికి ఎలాంటి చొరవ చూపకపోవటం బాధాకరమ న్నారు. ఇండోర్ స్టేడియంలను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కా ర్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సాగర్ కాలువల ఆధునికీకరణకు చర్యలు

ముండ్లమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలను ఆధునికీకరించి చివరి భూములకు సాగర్ జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర అగ్రికల్చర్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలోని దెబ్బతిన్న కల్వర్టులు, డ్రాపులను, జమ్మలమడక మేజరు, మక్కెన మైనర్ కాలువలో అల్లుకుపోయిన చిల్ల చెట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సాగర్ కాలువలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కాలువలు చిల్లచెట్లతో నిండిపోయి చివరి భూములకు నీరు అందక పంటలు నిలువునా ఎండిపోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే సాగర్ కాలువలను ఆధునీకరించి దెబ్బతిన్న కల్వర్టులు, బ్రిడ్జీల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదనలను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు పంపినట్టు చెప్పారు. త్వరలోనే నిధులు విడుదల వుతాయన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలసి కాలువల దుస్థితి గురించి వివరించి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే కాలువల్లో ఉన్న చిల్ల చెట్లను తొలగించి కాలువల చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోదేపల్లి డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు చింతలపల్లి వెంకటేశ్వరరావు, నిడిగంటి నారాయణ, రమణాల ఏడుకొండలు, ఎరబోలు చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిల్లచెట్లతో మూసుకుపోయిన మక్కెనవారిపాలెం మైనర్ కాలువను పరిశీలిస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచుమాటి శ్రీనివాసరావు

సీపీఎం నిరసన

దొనకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకుడుతాండవ రంగారావు విమర్శించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆపార్టీ నాయకుడు చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు పర్చేందుకు బడ్జెట్‌లో దొన కొండ పారిశ్రామిక కారిడార్‌కు, వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించక పోవటం వెనుకబడిన ఈప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయటమే అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందు ర్తి చిన్ననర్సింహులు, ఎర్రగుంట్ల ప్రభాకర్, కర్నా కృష్ణ, మాలపోలు అంజిబాబు, ఐలూరి రమణయ్య, కోలా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారి విగ్రహానికి అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలను అలంకరించారు. ఈ సందర్భంగా మేళ తాళాలతో గాలి గోపురం వద్ద నుంచి స్వామి వారికి మహా నైవేద్యాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తూ సమర్పించారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, నరసింహాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా సుమన్


సుమన్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

తాళ్ళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా మారం సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పుగంగవరం గ్రామంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా సుమన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మువ్వల శ్రీనివాసులు, నేరెళ్ల కిశోర్, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసన్నకుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా సుమన్ మాట్లాడుతూ మండలంలోని ఆర్యవైశ్యులకు నిత్యం అందు బాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

మండల సమావేశానికి అధికారుల గైర్హాజరు

వెలిగండ్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ఆదివారం స్థానికి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎంపీపీ రామణ మహాలక్ష్మి అధ్యక్షత వహించారు. అయితే, మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సమస్యలపై చర్చిందేందుకు అవకాశం లేకుండా పోయింది. సమావేశానికి అధికారు లు, కొంతమంది ప్రజా ప్రతినిధులు గైరాహజరయ్యారు. జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అధికారులు లేకుండా సమస్యల గురించి ఎవరితో చర్చించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు లేకపోవడంతో సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని ఎంపీడీవో మహబూబ్ బాషా తెలిపారు.

దర్శి పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛాంధ్ర

దర్శి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది ఆదివారం దర్శి పోలీస్‌స్టేషన్‌ను శుభ్రంచేశారు ఎస్‌ఐ ఎం.మురళీ ఆధ్వర్యంలో సిబ్బంది స్టేషన్‌లోని అన్నీ గదులను శుభ్రంచేసి చెత్తను బయటపడేశారు. పరిసరాల్లో ఉన్న పిచ్చిచెట్లు తొలగించి చదునుచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మురళీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్, పరిసరాలు శుభ్రం చేసినట్లు తెలిపారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

పామూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎస్‌ఐ టి.కిషోర్ బాబు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజ్జన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఖాళీ కందిపప్పు ప్యాకెట్లు

కురిచేడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్న సరుకులు దారి మళ్లుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో ఖాళీ కందిపప్పు ప్యాకెట్లు రోడ్లపై పడిఉన్నాయి. దీనిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదారను రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్నది. ఈ రేషన్ సరుకులను కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ వారి జేబులు నింపుకుంటూ పేదల కడుపుకొడుతున్నారు.

కురిచేడు - పొట్లపాడు రోడ్డులో మార్కెట్ యార్డు పక్కన రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించాల్సిన కందిపప్పు ప్యాకెట్లు చించిన స్థితిలో ఖాళీవి పెద్ద మొత్తంలో పడిఉన్నాయి. దళారులు, రేషన్ డీలర్లతో కుమ్మక్కై పేదలకు చెందాల్సిన కందిపప్పు బహిరంగ మార్కెట్‌కు తరలించి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


పొట్లపాడు రోడ్డులో పడిఉన్న ఖాళీ కందిపప్పు ప్యాకెట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎవరో?



- నేడు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 24 గంటల తర్వాతే ఫలితం వెలువడే అవకాశం
- గుంటూరు ఏసీ కళాశాలలో పకడ్బందీగా ఈసీ ఏర్పాట్లు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి మరికొన్ని గంటల్లో నూతన సభ్యుడెవరో తేలిపోనుంది. గత నెల 27న పోలింగ్ జరగ్గా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి గుంటూరు లోని ఏసీ కళాశాలలో ప్రారంభం కానుంది. బ్యాలెట్, ప్రాధాన్య ఓట్ల విధానంతో ఓట్ల లెక్కింపు జరగనుంది. భారీగా పోలింగ్ నమోదైన దృష్ట్యా తుది ఫలితం వెలువడ టానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నది. దీంతో ప్రధాన అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో రాజకీయంగా అంతగా పలుకుబడి లేని నాయకులే టీడీపీ తరపున బరిలోకి దిగారు. ఈ దఫా అందుకు భిన్నంగా దశాబ్ధాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉండి టీడీపీలో ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని పోటీకి దింపింది. దీంతో పార్టీ శ్రేణులతో జనసేన, బీజేపీ నేతలు ఆలపాటి గెలుపు కోసం కృషి చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ మొదలు పోలింగ్ ముగిసేంత వరకు శ్రమించాయి. మరోవైపు సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు అండగా నిలిచాయి. అయితే ఓటర్లు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల నుంచే కాకుండా డిగ్రీ పూర్తి చేసిన చాలామంది నమోదు చేసుకున్నారు. దీంతో వారి తీర్పు ఈ దఫా కీలకం కానుంది. ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారు ధీమా



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

(మిగతా 7వ పేజీలో)

అమరావతిలో.. అతి పెద్ద స్టేడియం



మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- స్పోర్ట్స్‌సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- అంతాసవ్యంగా జరిగితే 2027 కల్లా ఆవిర్భావం
- ఏసీఏకు 60 ఎకరాలు ఉచితంగా ఇవ్వనున్న ప్రభుత్వం
- రాజధాని సిగలో మరో ఆణిముత్యంగా భాసిల్లేలా మంత్రి లోకేశ్ ప్రణాళిక

రివర్‌ఫ్రంట్.. గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి ఆవిర్భవించబోతున్నది. ఇలాంటి రాజధాని నగరం క్రీడారంగంలో కూడా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోనున్నది. అమరావతి.. ప్రపంచ క్రీడారంగానికి ఓ దిక్సూచిగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. క్రికెట్ ప్రపంచానికి మరో మెల్‌బోర్న్‌గా అమరావతి స్పోర్ట్స్‌సిటీని తీర్చిదిద్దనున్నది. ఈ క్రమంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని అత్యాధునికంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మంత్రి లోకేశ్ సూచన మేరకు 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.800 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణం జరగనున్నది. క్రికెట్ ప్రపంచానికి తలమానికంగా అమరావతిలో క్రికెట్ స్టేడియం నిర్మించే విషయంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మంత్రి లోకేశ్‌కు సహకరిస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే 2027 కల్లా అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అమరావతిలో ఆవిర్భవించనున్నది.

మంగళగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనేక ప్రత్యేకతలకు నిలయంగా మారనున్న అమరావతిలో ఏ నిర్మాణం చేపట్టినా.. మరే ప్రాజెక్టును తలపెట్టినా అదో ఐకానిక్‌గా ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఉండాలన్న పట్టుదల చంద్రబాబుది. అమరావతి నిర్మాణంలో భాగంగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని కూడా అదరహో అన్న చందాన నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటికే ప్రపంచంలో అతిపెద్దదిగా ఉన్న అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంను మించి మరిన్ని సౌకర్యాలతో అమరావతిలో అగ్రగామిగా నిర్మించాలని నిర్ణయించారు. అమరావతి మాస్టర్‌ప్లానులో క్రీడా నగరాన్ని ప్రభుత్వ నగరానికి పశ్చిమంగా నదీతీరం వెంబడి సుమారు 1600 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత భౌతిక పరిస్థితులకు అనుగుణంగా చెప్పాలంటే బోరుపాలెం, అబ్బురాజుపాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, తుళ్లూరు పరిధిలో క్రీడా నగరం ఏర్పాటుకానున్నది. ఈ ప్రాంతంలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని భారీ హంగులతో నిర్మించాలని మంత్రి లోకేశ్ ప్రభుత్వానికి సూచించారు. తన ఈ ఆలోచనను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ఆయన ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాలను పరిశీలించే కార్యక్రమాన్ని ఇప్పటికే చేపట్టారు. గతవారం షార్జాలో భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను శివనాథ్‌తో కలిసి తిలకించిన మంత్రి లోకేశ్.. అక్కడ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు జైషాను కలిసి అమరావతి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం గురించి చర్చించారు.

రూ.800 కోట్లకు పైగా ఖర్చు

అమరావతిలోని స్పోర్ట్స్ సిటీలో రివర్ ఫ్రంట్ స్టేడియంగా దీనిని నిర్మించాలని ప్రాథమికంగా లోకేశ్ నిర్ణయించారు. ఇందుకోసం 60 ఎకరాలను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు ఉచితంగా ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని సూచనప్రాయంగా తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నరేంద్ర మోదీ స్టేడియంను రూ.800 కోట్లతో లక్షా 32 వేల సీటింగ్ సామర్థ్యంతో 63 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఇది మెల్‌బోర్న్ స్టేడియంను దాటేసి ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలిచింది. అయితే అమరావతి నరేంద్రమోదీ స్టేడియంను మించి నిర్మించాలంటే భారీ వ్యయమవుతోందన్న (రూ.800 కోట్లను మించి) అంచనాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ భారీ వ్యయాన్ని అందుకునేందుకు బీసీసీఐ నిధులకు తోడు మరికొన్ని నిధులను ప్రైవేటు సెక్టారు నుంచి సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దానికి సంబంధించిన సాధ్యాసాధ్యాల గురించి ప్రభుత్వం కూలంకుషంగా చర్చిస్తుంది.

ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తాం...



రాజధాని అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపులు చేసిన వెంటనే నిర్మాణ పనులను ఆరంభిస్తాం. అహ్మదాబాద్ స్టేడి యానికి ఏ మాత్రం తీసిపోని విధంగా నిర్మిస్తాం. అలాగే మంగళగి రిలోని స్టేడియాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తాం రంజీ మ్యాచ్‌ల వరకు మంగళగిరి స్టేడియాన్ని వినియోగించుకుంటాం. అమరావతిలో నిర్మించాలనుకుంటున్న అంతర్జాతీయ స్టేడియం గురించి మంత్రి నారా లోకేశ్ ఐసీసీ, బీసీసీఐ ప్రతినిధులతో నిరంతరం చర్చిస్తున్నారు. **- కేశినేని శివనాథ్, ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ**

రెండు అంతర్జాతీయ స్టేడియాలు

అమరావతిలోని స్పోర్ట్స్‌సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మిస్తే.. రాజధాని అమరావతిలో రెండు అంతర్జాతీయ స్టేడియాలు అవుతాయి. మంగళగిరిలోని అమరావతి టౌన్‌షిప్‌లో రూ.వంద కోట్లతో నిర్మించిన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు చివరిదశకు వచ్చాయి. ఇంకో పాతిక, ముప్పై కోట్లు ఖర్చు చేస్తే అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు ఈ స్టేడియం సిద్ధమవుతుంది. స్టేడియం చుట్టూ గ్రీనరీతోపాటు రోడ్లు, లైటింగ్, హోటల్ వంటి సౌకర్యాలతో పాటు నిడమర్రు రోడ్డులో రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్‌ను నిర్మించాలి. ఈ పనులు ఏడాదిలోగా పూర్తి చేస్తామని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తాజాగా ప్రకటించారు. అయితే అమరావతి స్పోర్ట్స్ సిటీలో క్రికెట్ స్టేడియంను నిర్మించాలన్న ప్రతిపాదనల నేపథ్యంలో మంగళగిరి స్టేడియాన్ని పూర్తి చేస్తారా లేదా అన్నది సంశయాత్మకంగా మారింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.21 (సోమవారం)

సహరి : 5.08 (మంగళవారం)

రాయితీపై.. రుణాలు

- ఈబీసీల కోసం ప్రభుత్వం కసరత్తు
- 9వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- బీసీ కార్పొరేషన్ ద్వారా పంపిణీకి చర్యలు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ మొదలు
- మూడు జిల్లాల పరిధిలో 15,000 మందికి లబ్ధి
- బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అగ్రవర్ణాల్లోని పేదలకు ఊతమివ్వడానికి కూటమి ప్రభుత్వం రాయితీపై రుణాలివ్వడానికి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ మేరకు జిల్లాల వారీగా యూనిట్ల కేటాయింపు, కులాల వారీగా మార్గదర్శకాలను గతంలోనే విడుదల చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈ నెల 9 నుంచి ఈబీసీ రుణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని అధికారులు చెబుతున్నారు. గతంలో మంజూరు చేసిన యూనిట్లకు అదనంగా కుట్టుమిషన్లు, జనరిక్ షాపుల కేటాయింపులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా యూనిట్ల వారీగా అర్హత సాధించిన లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనుంది. ఈబీసీ రుణాలను కూడా బీసీ కార్పొరేషన్ ద్వారానే ప్రభుత్వం ఇవ్వనుంది. తాజా బడ్జెట్ కేటాయింపుల్లో బీసీ కార్పొరేషన్‌కు నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించింది. నిధుల సమస్య కూడా లేనందున దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల గుర్తింపు జరిపి మార్చి నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేసి అగ్రవర్ణ పేదలకు లబ్ధి చేకూరుస్తామని అధికారులు చెబుతున్నారు. ఈబీసీ కోటా కింద గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 15,000 మందికి లబ్ధి చేకూర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాలో 3,600 మందికి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిపి 11,400 మందికి ఈ పథకం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రణాళికలు రచించింది. రాయితీ రుణాలపై అందించే



ఈబీసీ రుణాలపై సమీక్ష చేస్తున్న జేసీ ప్రఖర్‌జైన్ (పాత చిత్రం)

యూనిట్లలో ప్రధానంగా ఫ్యాషన్ డిజైనింగ్, డెయిరీలు, ఇతర చిన్న తరహా యూనిట్లకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుం ది. రాయితీ రుణాల నిమిత్తం మూడు జిల్లాల పరిధిలో రూ.130 కోట్ల వరకు రుణాలను ప్రభుత్వం లబ్ధిదారులకు అందించనుంది. ఈ యూనిట్లకు తోడు అదనంగా కుట్టుమిషన్ల రూపంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 16,000 మంది అగ్రవర్ణ పేదలకు మేలు జరిగేలా చూడాలని నిర్ణయించింది. వీటితో పాటు బీ ఫార్మసీ కోర్సుల్లో అర్హత ఉన్న వారికి శిక్షణ ఇచ్చి ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయబోయే జనరిక్ దుకాణాల్లో కూడా వాటా ఇవ్వనున్నది.

ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పూర్తి..

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా అట్టడుగున ఉన్న వారి సంఖ్య తేల్చడానికి ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసింది. ఈబీసీ కేటగిరీలోకి వచ్చే రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, కాపుతో పాటు ఇతర కులాల్లో ఉండే పేదల జాబితాను రూపొందించింది. ఈ నెల 9 నుంచి ఈబీసీ రాయితీ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ జరగనున్నది. వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న డేటాతో సరిపోల్చుకుని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

70,000 దరఖాస్తులు వస్తాయని అంచనా

ఈబీసీ రాయితీ రుణాల కోసం మూడు జిల్లాల పరిధిలో దాదాపు 70,000 వరకు దరఖాస్తులు వస్తాయనేది అధికారుల అంచనా. ప్రభుత్వం కేటాయించిన 15,000 యూనిట్లు తొలి విడతలో భాగమేనని, ఈబీసీ కేటగిరి కిందకు వచ్చే అర్హులైన పేదలందరికీ దశల వారీగా న్యాయం జరిగేలా చూస్తామనేది ప్రభుత్వ మాటగా ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వంలో దాదాపు 4,000 దరఖాస్తులు ఈబీసీ రాయితీ రుణాల కోసం వచ్చినవి ఉన్నాయి. వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా గత ప్రభుత్వం తాత్సారం చేయడంతో పాటు రాయితీ రుణాల నిధులను కూడా పక్కదారి మళ్లించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జరిగే ప్రక్రియలో వైసీపీ ప్రభుత్వంలో మూలన పడిన దరఖాస్తుల్లో అర్హులైన వారు ఉంటే వారికి కూడా ప్రయోజనం దక్కేలా చూడనున్నారు.

మహిళలకే తొలి ప్రాధాన్యం..

స్వయం ఉపాధి యూనిట్ల కోసం అందించే రాయితీ రుణాల విషయంలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. దానిలో భాగంగానే సదరు యూనిట్లు కూడా ఎక్కువ శాతం అతివలకు సంబంధించినవే ఉన్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్, బొటిక్స్, ఈవెంట్ ఆర్గనైజింగ్ వంటి వన్నీ కూడా ఎక్కువ శాతం మహిళలు రాణిస్తున్న రంగాలే కావడం గమనార్హం.

ఆయా రంగాల్లో నిపుణులచే శిక్షణ..

యూనిట్లు కేటాయించడమే కాకుండా వారు ఎంచుకున్న రంగంలో విజయం సాధించేలా నిపుణుల చేత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వమే చేపట్టనుంది. ఇప్పటికే లబ్ధిదారులు ఎంచుకున్న రంగంపై వారికి అవగాహన ఉంటే మరింత సానపట్టి వారిచేతే మిగిలిన వారికి శిక్షణ ఇప్పించే ప్రయత్నం కూడా అధికారులు చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడాన్నే అత్యంత కీలకం. శిక్షణకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలను జారీ చేసింది.

బకాయిలు రూ.14 కోట్లు



- కొండలా పేరుకుపోయిన నీటితీరువా
- ఏళ్ల తరబడి చెల్లింపులు జరపని వైనం
- సాగునీటి కాల్వలపై దృష్టి సారించని గత ప్రభుత్వం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిధిలో నీటి తీరువా బకాయిలు ఏళ్ల తరబడి కొండలా పేరుకుపోయి ఉన్నాయి. జిల్లాలో నీటి తీరువా బకాయిలు రూ.14 కోట్ల వరకు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం వీటి వసూళ్లపై పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో బకాయిలు ఈ స్థాయిలో ఉండడానికి కారణంగా ఉంది. గత ఏడాది అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సాగునీటి రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తొలుత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఆయా సంఘాలు ఇటీవల కొలువు దీరాయి. ఈ పరిస్థితుల్లో నీటి తీరువా బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ఆదేశాలతో రెవెన్యూ విభాగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రతి ఏడాది జూన్ మొదలుకుని నాలుగు నెలల పాటు సీజన్ల వారీగా ఈ తీరువాను వసూలు చేస్తారు. ఆయకట్టు కింద ఉన్న ప్రతి రైతు ఏడాదికి రూ.200 చెల్లించాల్సి ఉంది. రేపల్లె రెవెన్యూ డివిజన్ కింద రూ.5.50 కోట్లు బకాయిలు ఉండగా, చీరాల కింద రూ.5 కోట్లు, బాపట్ల రెవెన్యూ డివిజన్‌లో రూ.3.50 కోట్లు నీటీ తీరువా కింద రైతులు చెల్లించాల్సి ఉంది.

సాగునీటి సంఘాలు కొలువుదీరడంతో...

అస్తవ్యస్తంగా ఉన్న సాగునీటి రంగాన్ని తిరిగి గాడిన పెట్టాలంటే ముందుగా సదరు సంఘాలకు పాలకవర్గాలను నియమించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఇటీవలే జిల్లా వ్యాప్తంగా టీసీలకు, డీసీలకు పాలక వర్గాలను కొలువుదీర్చింది. దీంతో రైతుల నుంచి కాల్వల బాగు కోసం సంబంధించిన అభ్యర్థనలు వందల సంఖ్యలో ఆయా నీటి సంఘాల పదవుల్లో ఉన్న వారి వద్దకు వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇలా వచ్చిన అర్జీల సంఖ్య ఇప్పటి వరకు దాదాపు 500 వరకు ఉన్నాయంటే గత ప్రభుత్వం ఏ విధంగా సాగునీటి రంగాన్ని పడకేయించిందో అర్థమవుతోంది. వచ్చిన అర్జీలు ఎక్కువ శాతం తమ సాగు చివరి ఆయకట్టు కింద ఉందని, గడచిన ఐదేళ్లలో నీరు అందక తీవ్రంగా నష్టపోయామని న్యాయం చేయాలనే వినతులు వచ్చాయి. వీటితో పాటు చిన్నపాటి వర్షాలకే డ్రెయినేజీలు పొంగి ఆ నీరు పొలాల్లోకి వస్తుందని, తక్షణమే కాల్వల మరమ్మతు చేపట్టాలనే అర్జీలూ గణనీయంగానే ఉన్నాయి. అలా అందిన వాటిలో దాదాపు రూ.22 కోట్ల వరకు వ్యయం కాగల పనులు ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నీటితీరువా వసూలయితేనే ఆ నిధులను కాల్వల మర్మతులకు కేటాయిస్తే పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. దీంతో పాటు ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటికే దాదాపు 2 కోట్లతో కాల్వల్లో పూడికతీత పనులను ఈ ఎనిమిది నెలల కాలంలో చేపట్టింది. పూర్తి స్థాయిలో కాల్వలు బాగుపడాలన్నా, కరకట్టల భద్రత పటిష్ఠంగా ఉండాలన్నా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా నీటి తీరువా వసూలుపై యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది.

నిధులే కీలకం..

కాల్వల మరమ్మతుల మొదలుకుని కరకట్టలను పటిష్ఠ పరిచే వరకు పనులు వేగంగా జరగాలంటే నిధుల లభ్యతే కీలకం కానుంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నిధుల విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్నది. అయితే మరమ్మతులకు అయ్యే వ్యయం కోట్లలో ఉండడంతో నీటి తీరువా బకాయిల మీద ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మొత్తాలను కూడా గత ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో రైతులు తీరువా చెల్లించడానికి ముందుకు రాని పరిస్థితి క్షేత్రస్థాయిలో ఉంది. నీటి తీరువా మొత్తాలను తిరిగి ఆ ఆయకట్టు రైతుల బాగు కోసమే ఖర్చు పెట్టడమే రివాజు. నీటి తీరువా పెండింగ్ బకాయిలు చెల్లించే విధంగా రైతులకు అవగాహన కల్పించడంతో నీటి కష్టాలపై కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

గత ఐదేళ్లూ కడగండ్లే..

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల పాటు కాల్వలలో కనీసం పూడికతీత పనులను చేపట్టకుండా అన్నదాతల కడగండ్లకు కారణమైంది. సాగునీరు సకాలంలో అందక చివరి ఆయకట్టు రైతుల గోడు ఆలకించేవారే కరువయ్యారు. ఇదే సమయంలో నీటి తీరువా వసూలు చేసి ఆ మొత్తాలను కాల్వల నిర్వహణకు కేటాయించాల్సి ఉన్నా అలాంటి ప్రయత్నమేమీ గత ప్రభుత్వంలో జరగలేదు. పైగా సచివాలయాల వద్ద తీరువా చెల్లించాలంటూ రైతులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం సకాలంలో నీరందించడంలో ప్రణాళికలు లేకుండా వ్యవహించడం వల్లే తమకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయని గత ప్రభుత్వంలో రైతులు బలంగా నమ్మారు. దీంతో నీటి తీరువా కట్టడానికి రైతులు ముందుకు రాలేదు. ఓ దశలో ఆ మొత్తాలను కూడా పక్కదారి పట్టించిన ఘనత గత ప్రభుత్వానిది.

ఆదాయ మార్గంగా.. అక్రమ మైనింగ్

- వైసీపీ నేతల బాటలోనే కూటమి నేతలు
- కోటప్పకొండ దేవస్థాన భూముల్లోనూ మైనింగ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండను తవ్వేస్తున్నారు.. గతంలో వైసీపీ నేతలు కొండపై కన్నేశారు. ఇప్పుడు కూటమిలోని కొందరు నేతలు కొండతో పాటు ఆలయ భూములను చెరపట్టేశారు. అధికారం మారిందే కాని కోటప్పకొండ ప్రాంతంలో అక్రమ మైనింగ్ యధేచ్ఛగా సాగుతోంది. వైసీపీ నేతల బాటలోనే కూటమిలోని కొందరు నేతలు అక్రమ మైనింగ్‌ను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. అక్రమ మైనింగ్‌పై మండల స్థాయిలో ఏర్పాటు చేసిన అధికారుల కమిటీల పర్యవేక్షణ



మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతం

లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. క్రషర్లు ఉన్న రోడ్డులో కోటప్పకొండ దేవస్థానం భూములు ఉన్నాయి. వీటిని రైతులకు కౌలుకు ఇచ్చారు. ఈ భూముల్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. అదేమని అడిగితే అధికారం మాది ఏమైనా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ప్రజాప్రతినిధి బంధువుగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి కనుసన్నల్లో మట్టి మైనింగ్ జరుగుతోందని సమాచారం.

ఇంటింటికీ కొళాయి

- జలజీవన్ మిషన్ కింద గ్రామాలకు ప్రత్యేక నిధులు విడుదల
- ఎమ్మెల్యే ఏలూరి
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



పర్చూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం కింద పర్చూరు నియోజకవర్గంలోని 81 పనులకు రూ.36.55 కోట్లు మంజూరైనట్లు ఆదివా రం ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో రక్షిత తాగునీటి సరఫరా, ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, పైపు లైన్ నిర్మాణం, ఇంటింటికీ కొళాయి ఏర్పాటు తదితర పనులకు ఈ నిధులను వినియోగించనున్నట్లు వివరించారు. సీఎం చంద్రబాబు సహకారంతో కోట్లాది రూపాయల నిధులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చిన్నగం జాం మండలానికి 27 వర్కులకు రూ.8.19 కోట్లు, మార్టూరు మండలానికి నాలుగు వర్కులకు రూ.2.30కోట్లు, ఇంకొల్లు మండలానికి 15 వర్కులకు రూ.4.21కోట్లు, కారంచేడు మండలానికి 16 వర్కులకు రూ.9.68కోట్లు, పర్చూరు మండలానికి 13 పనులకు గాను రూ.7.34కోట్లు, యద్దనపూడి మండలానికి 6 వర్కులకు రూ.4.84కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గత వైసీపీ హయాంలో తాగునీటి ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు కూడా నోచుకేలేన్నారు. దీంతో కలుషిత నీటిని ప్రజలు తాగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన లో జలజీవన్ మిషన్‌కు జీవం లేకుండా చేశారన్నారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆ ప్రకటనలో ఏలూరి స్పష్టం చేశారు.

చెన్నుపల్లి-వైదన రోడ్డు అభివృద్ధి

- మంత్రి గొట్టిపాటి కృషితో రూ.3 కోట్ల నిధులు
- శరవేగంగా పనులు పూర్తి చేస్తామంటున్న కాంట్రాక్టర్లు

బల్లికురవ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న చెన్నుపల్లి వైదన గ్రామాల పంచాయతీ రాజ్ రోడ్డు అభివృద్ధి పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో ఉపాధి హామీ పథకం నిధులు రూ.3కోట్లు మంజూరయ్యాయి. చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, వైదన గ్రా మాల మధ్య ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని మోకాటిలోతు గోతులు ఏర్పాడ్డాయి. ఈ రోడ్డును గత వైసీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాల ప్రజలు రోడ్డు సమస్యలను మంత్రి రవికుమార్‌కు వివరించారు. మంత్రి వెంటనే నిధులు మంజూరు చేయించారు. స్నేహ కనస్ట్రక్షన్ కంపెనీ పనులను దక్కించుకున్నారు. మొత్తం ఈ రోడ్డు మార్జిన్ మట్టితో సహా ఏడున్నర మీటర్ల వెడల్పుతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో కొందరు రైతులు రోడ్డును ఆక్రమించుకున్నారని వారి సమక్షంలో రోడ్డును వెడల్పు చేసి శరవేగంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంపై ప్రజలు మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపారు.



చెన్నుపల్లి-వైదన రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

ఆక్రమణలతో కుంచించుకుపోయిన తారు రోడ్డు





నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సాహితీమిత్ర మండలి సభ్యులు

మధ్యతరగతి ప్రజల జీవనమంతా ఊహాలోకమే

కవి నాగేశ్వరరావు

అద్దంకి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మధ్య తరగతి ప్రజల జీవనమంతా ఊహా లోకమే అని ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు అన్నారు. సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం బంగ్లా రోడ్డులో ఉన్న చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో గుంటూరుకు చెందిన ప్రముఖ కవి, రిటైర్డ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి పెనుమాక నాగేశ్వరరావును ఘనంగా సత్కరించి సాహిత్య రత్న బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజల జీవనం ఆధారంగా నాగేశ్వరరావు రచనలు సాగాయన్నారు. నాగేశ్వరరావు రాసిన నాన్న నువ్వు సున్ననా, ఫారిన్ సెంటు, బార్ తం, వైతరణి, తోమింట ఒకటి, ఆలయం, దేవుడి పాట తదితర రచనల గురించి పాలపర్తి జ్యోతిష్మతి, కుందుర్తి స్వరాజ్యపద్మజ లు వివరించారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ యు, దేవపాలన, జ్యోతి చం ద్రమౌళి, లేవిప్రసాద్, ఆర్వీ రాఘవరావు, చందలూరి నారాయణరావు, పీసీహెచ్ కోటయ్య, సాంబశివరావు, చప్పిడి వీరయ్య, ఎల్.శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు పాల్గొన్నారు.

14 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 14 బస్తాల రేషన్ బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీత ఆదివారం పట్టుకున్నారు. ఈ ఘటన ఆదివారం ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అక్రమార్కులు ఒక వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ్రమాలకు తోడ్పాటు అందిస్తాం

- ఘనంగా చీరాలలో ఎంపీ కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలు
- వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ



చిన్నారికి కేక్‌ను తినిపిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని ఆశ్రమాలను చూసి మనసు చలించిందని, కచ్చితంగా ఆశ్రమాలకు తోట్పాటును అందిస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలు చీరాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ చీరాల దండుబాట రోడ్డులోని కోటయ్య ఆశ్రమంలోని వృద్ధు లు, చిన్నారులు, అలాగే సాల్మన్ సెంటర్‌లోని ఊటుకూరి వెంకట సుబ్బమ్మ వెల్‌ఫేర్ సొసైటీ, పాండురంగా వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు నిర్వహించా రు. వృద్ధులు, చిన్నారులతో సుదీర్ఘంగా మాట్లాడి ఉత్సాహ పరిచారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేక్ కటింగ్ నిర్వహించి అందరికీ పంచిపెట్టారు. అలాగే అందరికీ నూతన వస్త్రాలు పంపిణీ చేశా రు. అన్నదానం నిర్వహించారు. ప్రభు త్వం నుంచి ఎల్లవ్వుడూ అండగా ఉంటామని చెప్పారు. అలాగే మండల పరిధిలోని గవినివారిపాలెం గవిని మణికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఎంపీ వెంట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్, పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న శింగరకొండ తిరునాళ్లకు ట్రాఫిక్ మళ్లింపు

అద్దంకి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ మళ్లించనున్నట్లు చీరాల డీఎస్పీ మొయిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు అద్దంకి, శింగరకొండ వైపు వచ్చు భారీ వాహనాలు, లారీలు, కార్ల ను ట్రాఫిక్ మళ్లించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనాలను సంతమాగులూరు అడ్డరోడ్డు, నర్సరావుపేట, చిలకలూరిపేట, మేదరమెట్ల మీదుగా ఒంగోలు వైపు, రేణింగవరం నుంచి అద్దంకి మీదుగా దర్శి వెళ్లే వాహనాలను మేదరమెట్ల, వెల్లంపల్లి మీదుగా, ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల, మార్టూరు, చిలకలూరిపేట మీదుగా మళ్లించడం జరుగుతుందన్నారు. దర్శి వైపు నుంచి అద్దంకి మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కురిచేడు, వినుకొండ మీదుగా మళ్లించడం జరుగుతుందన్నారు. తిరునాళ్ల సందర్భంగా కట్టెల ట్రాక్టర్‌లు, గడ్డి ట్రాక్టర్‌లు, పొట్టు ట్రాక్టర్‌లకు ప్రవేశం లేదని తెలిపారు. తిరునాళ్ల వైపునకు ఆర్టీసీ బస్సులు, అంబులెన్స్‌లను మాత్రమే అనుమతించడం జరుగుతుందనన్నారు.



నీటి కోసం కోతి పాట్లు

శింగరకొండలో కోతులు వందల సంఖ్యలోనే ఉంటాయి. భక్తుల చేతిలో ఏమి కనిపిస్తే అవి లాక్కెల్తాయి. ఈ క్రమంలో అద్దంకి మండలం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఓ పిల్ల కోతికి దాహం వేసి భక్తుడి చేతిలో ఉన్న వాటర్ బాటిల్‌వైపు చూసింది. గమనించిన భక్తుడు తన వద్ద ఉన్న వాటర్ బాటిల్‌ను ఇచ్చాడు. దీంతో ఆ బాటిల్‌లో నీరు తాగేందుకు అష్టకష్టాలు పడింది. ఎలాగోలా బాటిల్‌ను అటుఇటు తిప్పి కిందాపైనా పోసుకుంటా చివరకు బాటిల్ కిందపడి తర్వాత నేలపైన దొర్లిన నీటితో దాహం తీర్చుకుంది.

– ఆంధ్రజ్యోతి, అద్దంకి

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠపురం బాల సాయినగర్‌లో ఆదివారం ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మహాన్నవనం, గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసం, నేత్ర ఉన్నీలనం, ధేను, కుంభ, జ్వాలా దర్శనం, పూర్ణాహుతి, శాంతి కల్యాణాన్ని (సీతారామకల్యాణం) జరిపించారు. ఈక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

చిదంబరేశ్వరుడిని తాకిన ఆదిత్యుని కిరణాలు

చినగంజాం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి లింగాకారానికి ఆదివారం సూర్యోదయం వేళ కొన్ని నిమిషాల పాటు భానుని లేలేత కిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి అప్పారావు మాట్లాడుతూ కార్తీక మాసం, శివుని పుట్టిన రోజు, మార్చి మొదటి వారంలో ఆదుత్యుని కిరణాలు స్వామి వారిని అభిషేకిస్తూ ఉంటాయని తెలిపారు. ఆదివారం ఉదయం 7.38 గంటల నుంచి ఐదు నిమిషాల పాటు స్వామి వారి లింగాకారానికి భానుడి కిరణాలు తాకినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యకిరణాలు స్వామి వారిని అభిషేకించే దృశ్యాన్ని భక్తులు తిలకించి పులకించారు.



చిదంబరేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

యోగా, ధ్యానంతో మానసిక వికాసం

పంగులూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శారీరక, మానసిక వికాసానికి యోగా, ధ్యానం ఎంతో దోహద పడతాయని ము ప్పవరం పీఎసెన్‌సీసీ ఉన్నత పాఠశాల పీడీ రాయిణి శేషగిరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం రేణంగివరం పోలీసులు ముప్పవరం ప్రభుత్వ బాలికల వసతి గృ హంలో విద్యార్థినులకు యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. యోగా కూడా క్రీడలలో భాగమని, పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలకు యోగాపై ఆసక్తి చూపాలని పీడీ సూచించారు. విద్య, క్రీడా రంగాలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని బాలికలు ఉన్నతంగా ఎదగాలని వార్డెన్ పద్మావతి కోరారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



ముప్పవరం బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న పీడీ శేషగిరి



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు, వైద్యులు

కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

145 మందికి పరీక్షలు

అద్దంకి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం మండపం వద్ద ఒంగోలు యామిని కంటి వైద్యశాల వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 145 మందికి డాక్టర్ ప్రత్తిపాటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి 40 మందికి చికిత్సలు అవసరమని గుర్తించారు. చికిత్సలు అవసరంలేని వారికి ఉచితంగా మందులు, డ్రాప్స్ అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి సగం ఖర్చుతో వైద్యం చేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ పి.నరసింహారావు, ఆప్తమాలిక్ అసిస్టెంట్ సుజాత, నీలిమ పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన



మసీదుకు శంకుస్థాపనలో పాల్గొన్న ముస్లింలు

పర్చూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో దాతల సహకారంతో నూతనంగా నిర్మించనున్న మసీదుకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం చేశారు. గతంలో ఇక్కడి పాత మసీదు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో నీరు చేరి ప్రార్థనలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో మసీదును తొలగించి నూతన మసీదు నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. రూ.కోటి వ్యయంతో దాతల సహకారంతో మసీదు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లి షేక్ నబీసా, చీరాల మసీదు ముఫ్తీ హబీబుల్లా, నరసరావుపేట మౌలానా సాహిద్, మసీదు ఇమాం, షేక్ అహ్మద్‌బాషా, షేక్ షంషుద్దీన్, బ్యాంక్ కాలేషా, బుల్లా మేస్త్రీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సంపదను సృష్టించడంలో కార్మికుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వెంకటరావు

చీరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సంపదను సృష్టించడంలో కార్మికుల పాత్ర కీలకమని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఏఐటీయూసీ 4వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్మికులు ఏకం కావాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతా యన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, మేడా వెంకటరావు, కోటి దాసు, శ్రీధర్, మాల్యాద్రి, ప్రకాష్, బాబూరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ప్రసాద్, పైడయ్య, బ్రహ్మయ్య, భారతి, కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుకు ప్రాథమిక చికిత్స ముఖ్యం


ఇంకొల్లు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటు వచ్చిన సమయంలో రోగికి ప్రథమ చికిత్సను అందించి ఆసుపత్రికి చేర్చేలా గ్రామీణ వైద్యుల సేవలు అవసరమని ప్రముఖ గుండె వైద్యనిపుణుడు కె.శ్రీధరబాబు సూచించారు. రోటరీ గంగ భవనంలో గురువారం మండల ప్రాథమిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మార్టూరు, పంగులూరు, ఇంకొల్లు మండలాల్లోని ఆర్‌ఎంపీలు హాజరయ్యారు. మెడీక్యూర్ హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టరు శ్రీధరబాబు మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన సమయంలో అందించాల్సిన ప్రాథమిక చికిత్స, ఆసుపత్రికి చేర్చేవరకూ తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవళి, డాక్టరు ఉస్మాన్, డాక్టరు రఫీ, శ్రీను, ఇంతియాజ్, శ్రీమన్నారాయణ, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

పెద్దజాగర్లమూడి (పర్చూరు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి చెరువులో గల్లంతైన విషయం తెలిసిందే. యద్దనపూడి మండలం పెద్దజాగర్లమూడి ఎస్సీ కాలనీలోని చెరువులో శనివారం చెరువులో వ్యక్తి పడిన విషయాన్ని తెలుసుకున్న అధికారులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ జాజుల మాల్యాద్రి, చీరాల ఫైర్ రెస్క్యూ టీం సహాయంతో శనివారం అర్ధరాత్రివరకూ, తిరిగి ఆదిఆరం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. అదే కాలనీకి చెందిన బొందు ప్రభాకర్‌రావు(46)గా గ్రామస్థులు గుర్తించారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభాకర్‌రావు భార్య దీనమ్మ అత్యావసర పనిమీద శనివారం ఉదయం బాపట్ల పుట్టింటికి వెళ్లగా, ఇంటర్ చదువుతున్న అతని ఇద్దరు కుమార్తెలు రెబ్‌కా, ప్రవల్లిక పరీక్షలు రాసేందుకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టేందుకు అప్పుడప్పుడూ ప్రభాకర్‌రావు వెళుతుంటాడని ఆ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాల్యాద్రి తెలిపారు.



చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది



భూసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలోచన ఉన్నతంగా ఉన్నా.... దాని ఆచరణలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడంలేదు. భూ సమస్య అనేది ఒకసారి అధికారుల దృష్టికి వచ్చాక, మరోసారి ఆ సమస్యతో బాధితుడు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రభుత్వం సూచిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇంకా నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు.. ఇప్పటివరకూ జరిగిన పరిష్కారాలను ఓ సారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.



మర్రిపాడు జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ భూమిలో జామాయిల్ మొక్కలు నాటిన ఆక్రమణదారులు

పరిష్కారమెప్పుడు...?

- రెవెన్యూ సదస్సుల్లో కోకొల్లలుగా భూసమస్యలు
- తీర్చడంలో అధికారుల నిర్లక్ష్యం
- రెండు నెలలు గడిచినా ఇంకా 33 శాతం పెండింగ్
- ప్రభుత్వ భూఆక్రమణల తొలగింపులోనూ జాప్యం
- ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా.. మారని రెవెన్యూ అధికారుల తీరు

నెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో 8,178 అర్జీలు అందాయి. రెండు నెలలు గడిచాక కూడా ఇంకా 2,762 అర్జీలకు పరిష్కారం దొరక లేదు. అంటే మూడోవంతు సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొన్ని మండలాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అటువంటి మండలాల అధికారులను కలెక్టర్, జేసీలు పదే పదే హెచ్చరిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఆఖరుకు ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను కాపాడడంలో కూడా రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

● భారీగా భూసమస్యలు

ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వంలో భూ సమస్యలు విపరీతమయ్యాయి. నాడు అధికార బలంతో సామాన్యుల భూములను వివాదంలోకి తీసుకెళ్లారు. విచ్చల విడిగా భూరికార్డులు మార్చేయడం, ఖాళీగా ఉంటే ఆక్రమించేయడం వంటి అనేక ఘటనలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతి నిధుల వద్దకు భూబాధితులు బారులు తీరారు. ఈ పరిస్థితి చూసిన ప్రభుత్వం.. భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. డిసెంబరు ఆరు నుంచి జనవరి 8 వరకు ఈ సదస్సులు జరిగాయి. జిల్లాలో మొత్తం 731 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను పర్యవేక్షించడానికి ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని స్పెషలాఫీసర్‌గా కలెక్టర్ నియమించారు. ప్రతీ మండలంలో రోజుకొక గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులకు స్పెషలాఫీసర్లతోపాటు తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వోలు పూర్తి రికార్డులతో హాజరయ్యారు. భూవివాదాలకు సంబంధించిన ప్రతీ అర్జీని స్వీకరించారు. అక్కడికక్కడే పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించారు. మొత్తంగా నెల పాటు జరిగిన రెవెన్యూ సదస్సులో 8178 అర్జీలు ప్రజల నుంచి అందాయి. వీటిలో సగం వరకూ ఆర్‌వోఆర్(రైట్స్ ఆఫ్ రికార్డ్స్)కు సంబంధించిన సమస్యలే కావడం గమనార్హం. ల్యాండ్ గ్రాబింగ్, ప్రభుత్వ భూముల ఆక్రమణలు వంటి అనేక నేరాలు ఈ రెవెన్యూ సదస్సుల వేదికగా వెలుగు చూశాయి.

● పరిష్కారంలో జాప్యం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన కొన్ని చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇలాంటివి సుమారు రెండు వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మిగిలిన సమస్యల పరిష్కారంలోనే జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకూ మొత్తం అర్జీలు 8178కు గానూ 5416 అర్జీలను పరిష్కరించారు. ఈ అర్జీల్లో 4106 అర్జీలు ఆర్‌వోఆర్‌కు సంబంధించినవిగా ఉన్నాయి. అంటే భూహక్కులకు సంబంధించినవి. వీటిలో 2812 సమస్యలను పరిష్కరించగా ఇంకా 1294 సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ప్రభుత్వ భూములను ఆక్రమించారని 108 అర్జీలు రాగా ఇప్పటి వరకూ 23 పరిష్కరించారు. మరో 85 అర్జీలను పరిష్కరించాల్సి ఉంది. ఉదాహరణకు.. రాపూరు మండలం శానాయపాలెం గ్రామ పరిధిలో కండలేరు జలాశయానికి ప్రభుత్వం అప్పగించిన భూమిని ఇతరులు నిమ్మ చెట్లు వేసుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినా వాటిని పట్టించుకోని మండలాధికారులు.. ఆ ఆక్రమణదారుల సౌలభ్యం కోసం ఏకంగా దారిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడాన్ని బట్టి క్షేత్రస్థాయి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. కాగా ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి రెవెన్యూ సదస్సుల్లో 78 సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో నమోదు కాగా ఇప్పటికి 15 మాత్రమే పరిష్కరించారు. ఇంకా 63 సమస్యలకు పరిష్కారం దొరకలేదు. ఇక దారి వివాదాలకు సంబంధించి 42 సమస్యలు రాగా, కేవలం 13 మాత్రమే పరిష్కరించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో ముత్తుకూరు, గుడ్లూరు, సంగం, సైదాపురం, దగదర్తి, ఆత్మకూరు, వలేటివారిపాలెం, కావలి, కలిగిరి, జలదంకి, మర్రిపాడు, వింజమూరు వంటి మండలాలు వెనుకబడి ఉన్నాయి. పొదలకూరు, తోటపల్లి గూడూరు, రాపూరు, ఏఎస్‌పేట, కలువాయి, చేజర్ల వంటి మండలాల్లో తక్కువ సమస్యలు నమోదైనా వాటిని పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు

- జిల్లాలో 25,024 మంది విద్యార్థులు
- 79 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(విద్య), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 79 కేంద్రాల్లో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేం ద్రానికి చేరుకోవాలని, 9గంటలు దాటాక కేంద్రంలోకి అనుమతిం చమని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో 23,994, ఒకేషనల్‌లో 1,030 మంది కలిపి 25,024 మంది హాజరవుతున్నారన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 1400 మంది సిబ్బందిని, హైపవర్ కమిటీతో పాటు జిల్లా పరీక్షల కమిటీ, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామని వారు తెలిపారు. అలాగే సీసీ కెమరాల నిఘా నీడలో జరిగే ఈపరీక్షల కేంద్రాల్లోకి, విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరూ కూడా సెల్‌ఫోన్లు, క్యాలుకొలేటర్లు, అభ్యంతరకరమైన వస్తువులు, ఇతర కాగితాలను అనుమతించబోమన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో గుర్తించిన 12 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, బందోబస్తును కట్టుదిట్టం చేశామని అధికారులు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 28 జోన్‌ల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలను భద్రపరిచి, పరీక్షకు అరగంట ముందుగా స్టేషన్ నుంచి తీసుకెళ్లేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. జిల్లాలో ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యంతోపాటు పరీక్ష కేంద్రంలోని కింద గదుల్లోనే పరీక్ష రాసే వెసులుబాటు కల్పించామన్నారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులను తనిఖీ చేసేందుకు బాలురకు, బాలికలకు వేర్వేరుగా సిబ్బందిని నియమించామని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసుశాఖతో చర్చించి అన్నీ చర్యలు తీసుకున్నామన్నారు. తమ పిల్లలను అరగంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, కంగారు పడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని ఆర్ఐవో సూచించారు.



కావలి మునునూరు రైల్వే ట్రాక్‌కు పడమర వైపున కబ్జాకు గురైన డొంక రోడ్డు, శ్మశానం దారి

- కావలిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు
- నకిలీ పట్టాలతో కాలనీల్లో హల్‌చల్
- నిజమైన లబ్ధిదారులకు బెదిరింపులు
- ఆక్రమణదారులకు అండగా నాడు వైసీపీ నాయకులు.. నేడు టీడీపీ నేత
- పట్టించుకోని పాలకులు, రెవెన్యూ అధికారులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : 6.20
సహరి (మంగళవారం) : 5.04

దర్జాగా కబ్జా!

కావలి రూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వం రిజర్వ్ చేసి ఉంచిన స్థలాలు, శ్మశాన వాటికలు, వాటిదారులు, డొంకలను ఆక్రమణదారులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. కావలి కనకపట్నంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో భూముల ధరలు బాగా పెరిగాయి. దీంతో కబ్జాదారులు పట్టణ శివార్లలో ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేశారు. నకిలీ పట్టాలతో ఆక్రమించి, అమ్మకాలు సాగిస్తున్నారు. అయినా పాలకులుకానీ, రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● భూముల ధరలు పెరగడంతో...

కావలి మునునూరు శివారు ఇందిరమ్మ కాలనీలో సుమారు 15 ఏళ్ల క్రితం విశాలమైన రోడ్లతో లేఅవుట్లు వేసి సుమారు 6,000 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. నేడు పట్టణ పరిధితోపాటు, భూముల ధరలు పెరిగాయి. అప్పటి కాలనీల్లో లేఅవుట్లకు పోను ఇతర అవసరాల కోసం రిజర్వ్‌లో ఉన్న స్థలాలను, నాటి వైసీపీ నాయకులు, నేటి ఓ టీడీపీ నేత అండతో కొందరు ఆక్రమిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు రెవెన్యూ ఉద్యోగుల అండతో గతంలో ఇక్కడ పనిచేసిన వెళ్లిన తహసీల్దార్లు ఇచ్చినట్లు ఫోర్జరీ స్టాంపులు, సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి, అమ్మకాలు సాగిస్తున్నారు. మునునూరు ఆటోస్టాండ్ నుంచి పాత రైల్వేగేటు మీదుగా బుడంగుంట వెళ్లే మార్గంలో రైలు కట్టకు పడమర వైపున ఉన్న దారిని వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ చోటా నేతలు ఆక్రమించారు. అలాగే మునునూరులోని ఎస్సీ, బీసీ, ఓసీలకు చెందిన 300 కుటుంబాలవారు రైల్వేట్రాక్‌కు తూర్పున నివాసం ఉన్నారు. పడమర వైపున వినాయక ఆ కాలనీ పక్కనే ఉన్న శ్మశానవాటికు వెళ్లే దారిని వైసీపీ నేతలు కబ్జాచేసినా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోయారు. దీనికితోడు ఇందిరమ్మకాలనీలో లేఅవుట్‌లు వేసి పట్టాలు ఇవ్వగా, లేఅవుట్‌లు పోను రిజర్వ్‌లో ఉన్న స్థలాలు, రోడ్డు క్రాస్ బిట్లను కబ్జా చేసేశారు. లేఅవుట్‌లోని లబ్ధిదారుల పేరున ఉన్న ఖాళీ స్థలాలకు కూడా నకిలీ పట్టాలు సృష్టించి, వారికి తెలియకుండానే ఇతరులకు అమ్మేశారు. ఇదేమని ప్రశ్నిస్తే ఈ స్థలంలో మీరు ఇల్లు కట్టుకోనందున ఈ స్థలం తహసీల్దార్ మాకు కేటాయించి, పట్టా ఇచ్చారంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కాగా పట్టణంలోని వెంగళరావునగర్‌కి చెందిన జ్యోతి అనే మహిళకు 2008లో అట్లల ఫ్యాక్టరీ సమీపంలో ప్రభుత్వం వేసిన లేవుట్‌లో ప్లాటు కేటాయించారు. అయితే అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకపోవటంతో ఆమె బేసుమెంట్ వేసుకుని జీవనోపాధి కోసం నెల్లూరుకి వెళ్లారు. ఇటీవల కొందరు వ్యక్తులు స్థానిక టీడీపీ నేత అండతో ఆ స్థలం మాది అంటూ కంచె వేశారు. దీంతో స్థానికులు అడ్డుకుని అసలైన లబ్ధిదారుకు తెలపటంతో ఆమె వచ్చి కంచె తొలగించారు. మా స్థలానికి మీకు పట్టా ఎవరు ఇచ్చారని ఆమె ప్రశ్నించగా, మీరు ఇల్లు కట్టుకోలేదని తహసీల్దార్ మాకు పట్టాయిచ్చారని చెప్పడంతో వారిమధ్య వాగ్వివాదం జరిగింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పలు కాలనీల్లోని రోడ్లు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగించటంతోపాటు నకిలీ పట్టాల సృష్టికర్తలు, కబ్జాదారుల పై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అట్లల ఫ్యాక్టరీ సమీపంలో ఇటీవల ఆక్రమణకు గురైన స్థలంలో కంచె తొలగిస్తున్న స్థానికులు

- ఆశాలకు ప్రభుత్వం వరాల జల్లు
- క్షేత్రస్థాయిలో మిశ్రమ స్పందన
- డిమాండ్లన్నీ పరిష్కరించాలి : యూనియన్ డిమాండ్

ఫలించిన పోరు!

నెల్లూరు (వైద్యం) మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికి ప్రసూతి సెలవుల్లో వేతనాలతోపాటు, పదవీ విరమణ వయసు 62 ఏళ్లుగా నిర్ధారించింది. అలాగే పదవీ విరమణ తర్వాత గ్రాట్యుటీ ఇచ్చేందుకు కూడా అంగీకరించింది. దీంతో జిల్లాలోని 1811 మంది ఆశాకార్యకర్తలకు ప్రయోజనం చేకూరనున్నది. అయితే పూర్తి డిమాండ్లు పరిష్కరించాలని ఆశా కార్యకర్తల యూనియన్ డిమాండ్ చేస్తున్నది.

● హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించారు. ఇదిలా ఉండగా జిల్లాలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల్లో మాత్రం మిశ్రమ స్పందన కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలను వారు స్వాగతిస్తూనే... పూర్తి స్థాయిలో తమ డిమాండ్లు పరిష్కరించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే ఆశా కార్యకర్తలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. ఏఎన్ఎంల నియామకాల్లో అర్హతను బట్టి ఆశాలకు గుర్తింపు నిచ్చారు. అలాగే రేషన్‌కార్డుతోపాటు ఎన్టీఆర్ వైద్య సేవాపథకం వర్తింప చేసేటట్లు కృషి చేశారు. తాజాగా ఉద్యోగ విరమణ తర్వాత వృద్ధాప్య పింఛను అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. వీరికి వేతనాల కింద కేంద్ర ప్రభుత్వం రూ. 7వేలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 3వేలు కలిపి రూ. 10వేల జీతం చెల్లిస్తున్నది. ప్రస్తుతం ఏఎన్ఎంలతో సమానంగా 20కిపైగా వైద్య పథకాలను ఆశా కార్యకర్తలు అమలు చేస్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత ఐదేళ్లలో వారు అనేక పోరాటాలు చేశారు. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.సీఎం చంద్రబాబు నిర్ణయంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్లు ఇవే...

- కనీస వేతనం చెల్లించాలి
- ఆశాకార్యకర్తలను కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లుగా గుర్తించాలి.
- ఏఎన్ఎం శిక్షణ పొందిన వారికి పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలి
- దశలవారీగా ఆశాలకు ఏఎన్ఎం శిక్షణ ఇవ్వాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- అనారోగ్యానికి గురయిన ఆశాలకు సెలవులివ్వాలి
- గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు(ఫైల్)

వైద్య పథకాలపై శిక్షణేదీ ?



ఆశాకార్యకర్తలు ఎన్నో వైద్య పథకాలను అమలు చేస్తున్నారు. అయితే ఆ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారేకానీ, వాటిపై మాత్రం శిక్షణ ఇవ్వడం లేదు. వెంటనే శిక్షణ ఇవ్వాలి. ఆశాలు ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చుల కింద ప్రభుత్వం కొంత మొత్తం అందించాలి. అనారోగ్యంతో సెలవు పెట్టాలంటే ఐదుగురు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. దీన్ని నుంచి విముక్తి కలిగించాలి. తమ డిమాండ్లు అన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలి.

- మధుసూదన, యూనియన్ జిల్లా కోశాధికారి

పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి



ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిష్కరించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు కొన్ని వరాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. ఇంకా సమస్యలు చాలా వరకు పెండిం గ్‌లోనే ఉన్నాయి. వాటిని కూడా పరి ష్కరించాల్సి ఉంది.

- దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

ఏగ్రేడు ధాన్యం పుట్టి రూ.19,720

- మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయం
- అందుబాటులో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- వీపీఏల వద్ద రైతులు కూపన్లు పొందాలి
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయని, రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు పౌరసరఫరాలశాఖ జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 3.57లక్షల ఎక రాల్లో వరి సాగు అయిందని, సుమారు 11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ప్రభు త్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు పుట్టి ఏగ్రేడు ధాన్యానికి రూ.19,720ల మద్దతు ధర అందిస్తామని తెలిపారు. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకునేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లోని వీపీఏలను సంప్రదించాలని ఆమె సూచించారు. కోతకు సిద్ధం గా ఉన్న పొలాల రైతులు కూడా వీపీఏల ద్వారా షెడ్యూల్ జనరేట్ చేయించుకుని కూపన్లు పొందాలని పేర్కొన్నారు. రైతుల మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా ఈ కూపను పంపుతా మని తెలిపారు. ఈ కూపనుకు వారం గడువు ఉంటుందని, ఆ సమయంలోనే ధాన్యం కొనుగోలు ఉంటుందని తెలియ చేశారు. ఒకవేళ ఆలస్యమైతే మరోసారి రీషెడ్యూల్ చేయిం చుకునే అవకాశం ఉందని ఆమె వివరిం చారు. రైతులకు బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి మంచి రేటుకు లభిస్తే అమ్ముకోవచ్చని, వారి వివరాలను కూడా యాప్‌లో పొందుపరుస్తామన్నారు.

ఈ-క్రాఫ్ నమోదుకు నేటితో ముగింపు

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథ కాలు అందాలంటే అవసరమైన ఈ-క్రాఫ్ నమోదు సోమవారంతో ముగియనుంది. ఈ-క్రాప్ నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకోకపోయినా, పథకాలు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికీ చేయించుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వీపీఏలను సంప్రదించి, తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ. సత్యవాణి సూచించారు. కాగా జిల్లాలో సుమారుగా 98శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. దాదాపు 3.44లక్షల ఎకరాలకుగానూ 3.36లక్షల ఎకరాలకు ఈ-క్రాప్ నమోదైంది. ఈకేవైసీ కూడా 90శాతం పూర్తయింది. రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ఈ-క్రాప్, ఈకేవైసీలో కొంత జాప్యం జరిగింది. నూరుశాతం నమోదుకు కృషి చేస్తున్నామని ఆమె వివరించారు. సెలవు రోజుల్లోనూ క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని, రైతులు కూడా బాధ్యతగా ఈ-క్రాఫ్, ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావాలని ఆమె తెలిపారు.

8న కావలిలో మెగా లోక్అదాలత్

అల్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న కావలిలో నిర్వహించనున్న మెగా లోక్అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని లోక్అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులు, ఖర్చులు భరించలేని వారు అప్పీల్ లేని అంతిమ తీర్పులకు ఈ లోక్అదాలత్ మంచి అవకాశమని పేర్కొన్నారు. కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో జరిగే ఈ లోక్అదాలత్ సత్వర న్యాయం కోసం ఏర్పాటు చేస్తున్నారని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దంతం వారి వీధిలోని సాయిబాబ మందిర ప్రాంగణంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సుశీల నేత్రాలయ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి సుధాకర్రావు పర్యవేక్షణలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 50మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. శస్త్ర చికిత్సల నిమిత్తం 20 మందిని నెల్లూరు ఆసుపత్రికి తరలించారు వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని రోటరి క్లబ్ అధ్యక్ష కార్యదర్శి స్వర్ణలత, సలీం బేగ్లు తెలిపారు. ఆలయం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో టంగుటూరి ప్రసాద్, రమేష్ నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల దాడిపై చర్యలు తీసుకోవాలి

అల్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : భీమ్ ఆర్మీ పార్టీ అధినేత, నాగిన నియోజకవర్గం ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ వాహనంపై రాళ్లతో దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్రాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీగా వ్యవహరించే దళిత నాయకుడికే రక్షణ లేకుండా పోయిందని, ఇక సామాన్య దళితుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలుస్తోందని పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్పై దాడికి పాల్పడిన వారిని ఆయన అనుచరులు పట్టుకొని పోలీసులకు అప్పగించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నూతన మోటారు వాహన చట్టాలపై అవగాహన



గ్రామస్థులకు చట్టాలను వివరిస్తున్న ఎస్సై భోజ్య

బిట్రగుంట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన మోటారు వాహన చట్టా లపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై భోజ్య అన్నా రు. బోగోలు బజారు కూడలిలో ఆదివారం ఆయన వాహన చోదకులకు నూతన చట్టాలను వివరించారు. చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని, నిబంధనలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక వ్యాపారులు, వాహనదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు!

● నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు ● పట్టించుకోని మున్సిపల్ అధికారులు
● ఇబ్బందుల్లో వాహనచోదకులు, ప్రజలు



ఆర్వోబీ సర్వీస్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్పీడ్ బ్రేకర్

కావలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ ప్రజలు తమ ఇళ్ల, దుకాణాల ముందు నిబంధనలకు విరుద్ధంగా ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. పట్టణంలో ఏ వీధిలో అడుగుపెట్టినా స్పీడ్ బ్రేకర్ లేని రోడ్డే లేదంటే అతిశయోక్తి కాదు. ఎక్కడైనా పాఠశాలలు, ఆసుపత్రులు తదితర రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు అవసరమనుకుంటే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే వారు వేస్తారు. లేదంటే వారి పర్యవేక్షణలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలు వేసుకోవాలి. కానీ కావలిలో మున్సిపాల్టీ అనుమతులు లేకుండా రోడ్లన్నీ వారి సొంత జాగీర్లాగా ఎవరిష్టానుసారం వారు ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఈ స్పీడ్ బ్రేకర్ల వలన వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ఎత్తుగా వేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అనవసరమైన చోట ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించి అవసరమైన చోట ప్రమాదాలకు అవకాశాలు లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం గ్రామం నుంచి పరకొండపాడు వెళ్లేదారిలో నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నందున సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం ఎస్సీ కాలనీ, రెడ్డిపాలెంలకు సరఫరా నిలిచిపోతుందని, ఈ లైనులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కూడా ఆతర్వాత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి : ఏఈ

వలేటివారిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఒక్కో కిలోవాట్కు డెవలప్మెంట్ చార్జీలు రూ. 2 వేలు అని, ఇప్పుడు 50 శాతం రాయితీపై వెయ్యి రూపాయలు మాత్రమే అని తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకూ ఉందని గృహ వినియోగదా రులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

శ్రీకాళహస్తీశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో కావలి చిన్నారుల ప్రతిభ



శ్రీకాళహస్తి ఆలయ ఈవో రాజశేఖర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులు

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వర ఆలయ బ్రహ్మో త్సవాల్లో నాట్య గురువు జాహ్నవి స్థాపించిన కావలి జయం కూచిపూడి నాట్యాలయ చిన్నారులు శనివారం రాత్రి కూచిపూడి నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నాట్యాలయ చిన్నారులు ఆరాధ్య, మేఘశ్రీ, ఆకాంక్ష, నిఖిత, నిర్మయి, మధుప్రియ, మనస్వినిప్రియ, సమన్విత, ప్రణవి భావిక్,పావని, మౌనిక, తేజస్వి, భవానిలు ఉత్తమ ప్రదర్శన అందించి ప్రతిభ చాటడంతో ఆలయ ఈవో రాజశేఖర్ ప్రశంసా పత్రాలు, మెమొంటోలతో సత్కరించారు. నాట్యాలయం నిర్వాహకురాలు జమున పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నతి : ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

కావలిటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఇష్టపడి చదివితే భవిష్యత్లో ఉన్నతస్థానానికి చేరవచ్చని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బృందావనం కల్యాణ మండపంలో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డైరెక్టర్ జానకిరామ్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని క్రీడల్లో విజేతలకు, ర్యాకర్లకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బెజవాడ రవికుమార్, నందనవనం మధుసూధన్రావు, కొండయ్య, తిరివీది ప్రసాద్, మస్తాన్ పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్కు మరమ్మతులు



మంచినీటి పైపులైన్కు మరమ్మతులు పూర్తి చేసి, మట్టిని పూడుస్తున్న ఎక్స్కవేటర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగసముద్రం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం నుంచి వాకమళ్లవారిపాలెంకు వెళ్లే మంచినీటి పైపులైన్కు రాళ్లపాడు- రోళ్లపాడు మంచినీటి పథకం నిర్వాహకులు మరమ్మతులు చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వర్షం నీరు కాదం డోయ్- మంచినీరే శీర్షికతో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఆదివారం ఉదయం మంచినీటి పథకం నిర్వాహకులు గాలంకి ప్రసాద్, సిబ్బంది పైపునకు మరమ్మతులు చేసి మంచినీటి లీకేజీని అరికట్టారు. అయితే ఐదు రోజుల నుంచి మంచినీరు ఆర్అండ్బీ రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డు దెబ్బతింది. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాడాలి



మాలల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జనార్దన్

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాడాలని మాల ఉద్యోగుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరమాల జనార్దన్ తెలిపారు. మండలంలోని పోకూరు లో జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల, మాదిగలను విడదీయడానికి రిజర్వేషన్ వర్గీకరణ అమల్లోకి తీసుకురాడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమానికి ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వలేటివారిపాలెం మండలం మాల మహానాడు నూతన కమిటీని ఎన్నుకున్నారు. మాల మహానాడు నాయకులు లింగాబత్తిన బ్రహ్మయ్య, డిసిహెచ్ మాలకొండ య్య, చిరంజీవి, దొన్నే మద్దెల సుబ్బారావు, దమ్ము థామస్, కట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో దాతలు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు

బిట్రగుంట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రిగలో నిర్మించ నున్న రామాలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణ కుమార్, సంధ్య దంపతులు అమరాబచ్చు ట్రస్ట్ నిధులతో ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్నారు. నూతన ఆలయ నిర్మాణ ప్రాంగణంలో సీతారాముల చిత్ర పటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం, ప్రసా దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ, మాజీ చైర్మన్ శ్రీరామ్మాల్యాద్రి, విశ్రాంత ఇంజినీరు గోపీకృష్ణ, వైద్యులు ఆనందసాగర్, సాయిసేవకులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు చర్యలు

● ఖుద్దూస్బాషా, ఇన్చార్జి ట్రాన్స్కో ఏఈ



ఉదయగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మండల ఇన్చార్జి ట్రాన్స్కో ఏఈ ఖుద్దూస్బాషా పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

ఇంటర్వ్యూ

? మండలంలో లోఓల్టేజీ సమస్య ఉందా.

! మండలంలో లోఓల్టేజీ సమస్య నివారించేందుకు ఇటీవల ఎనిమిది నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటుచేశాం. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం.

? వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారా.

! వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో మంజూరు చేయిస్తున్నాం. గతంలో కొంత సామగ్రి కొరత ఉండేది. ప్రస్తుతం ఆ సమస్య లేదు.

? శిథిలావస్థకు చేరిన స్తంభాలను మారుస్తున్నారా.

! మండలంలో శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నాం.

ఆధ్యాత్మికతకు ధ్యానం దోహదం

వింజమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ఆధ్యాత్మిక ఎదుగుదలకు దోహదపడుతుందని నెల్లూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివ అలహరి అన్నారు. వింజమూరులోని శ్రీవేద వ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాకాహారం గొప్పతనాన్ని వివరిస్తూ కరపత్రాలు పంచుతూ పిరమిడ్ నగర్ సీతారామతోట, వైశ్యబజార్ వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

పిచ్చిమొక్కలతో నిండిన సంగం - కలిగిరి రోడ్డు మార్జిన్

● ప్రమాదాల బారిన వాహనచోదకులు
● పట్టించుకోని ఆర్అండ్బీ అధికారులు



రహదారి మార్జిన్ కనిపించకుండా ఏపుగా పెరిగిన మొక్కలు

సంగ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం - కలిగిరి రహదారి మార్జిన్ పిచ్చి మొక్కలతో నిండిపోయి ప్రమాదాలకు నిలయంగా మారిందని వాహన చోదకులు ఆవేదనన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏకవరుస రహదారిగా ఉన్న సంగం - కలిగిరి రహదారిని తొమ్మిదేళ్ల కిందట రెండు వరుసల తారు రోడ్డుగా మార్చారు. సంగం చెక్పోస్టు నుంచి హసనాపురం వరకు రహదారిని అభివృద్ధి చేశారు. దీంతో ప్రయాణికులతోపాటు వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. రెండు వరుసల రహదారిగా మార్చడంతో వాహన రాకపోకలు పెరిగి ఇటీవల రద్దీగా మారింది. నిత్యం పామూరు - నెల్లూరు, ఏయస్పేట - నెల్లూరుకు తిరిగే ఆర్టీసీ బస్సులతోపాటు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో నిత్యం మరింత రద్దీగా మారిపోయింది.

రోడ్డుమార్జిన్ కనిపించక ప్రమాదాలు

రహదారికి రెండు వైపుల ఏర్పాటుచేసిన మార్జిన్ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ పిచ్చి మొక్కలతో సుమారు ఐదడుగుల ఉన్న మార్జిన్ కనిపించడంలేదు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంగం- హసనాపురం మధ్య ఇలాంటి ఘటనలు తరుచుగా జరుగుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు వరుసల రహదారి కావడంతో కార్లు, ఆటోలు, వాహనదారులు వేగంగా నడుపుతున్నారు. ఈక్రమంలో మార్జిన్ లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్అండ్బి అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లో పిచ్చిమొక్కలు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఎస్బీఐ ఖాతాదారులకు సువర్ణావకాశం



మాట్లాడుతున్న మేనేజర్ మహమ్మద్ మున్వర్

ఆత్మకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా ప్రవేశపెట్టిన ప్రమాద బీమా ఖాతాదారులకు సువర్ణావకాశం అని స్థానిక బ్యాంక్ మేనేజర్ మహమ్మద్ మున్వర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆత్మకూరులో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని రెట్టింపు చేస్తూ నూతన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో ఖాతాదారుడు ఏడాదికి రూ. 2వేలు ప్రీమియం చెల్లిస్తే ఏడాది పాటు ఈ పాలసీ వర్తిస్తుందని తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఖాతాదారుడికి ప్రమాదవశాత్తు మరణం సంభవించిన లేదా పూర్తిస్థాయి అంగవైకల్యం ఏర్పడినా పాలసీదారుని కుటుంబానికి రూ. 40 లక్షలు ఇన్సురెన్స్ రూపంలో నగదు చెల్లిస్తారని తెలిపారు. వీటితోపాటు పాలసీ పొందినవారు ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో అంబులెన్స్ లేదా ప్రైవేటు వాహనాన్ని ఉపయోగించినా వాటి ఖర్చులు, పాలసీదారుడు మరణించిన సమయంలో వారి కర్మకాండ ఖర్చులకు నగదు చెల్లిస్తారన్నారు. ఈ సువర్ణవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

వింజమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రబల్లిపాలెంలో ఆదివారం ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

అనంతసాగరం మార్చి2(ఆంధ్రజ్యోతి): పరీక్షలకు సమయం ఆసన్నమైంది... శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని అనంతసాగరం ఎంఈవో-2 కే ప్రభాకర్రెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించిరు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం మండలంలోని సోమశిల, అనంతసాగరం, కొత్తపల్లి, రేవూరు, వెంగంపల్లి, కామిరెడ్డిపాడు, చిలకలమర్రి ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి స్టడీ అవర్స్ను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

కాటేపల్లి ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజలు

వింజమూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటేపల్లి ఉన్నత పాఠశాలలో త్వరలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ లక్ష్మీరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ గంగాభవానీ, గంగరాజు, ఉపాధ్యాయులు సరళ, యు.శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

● మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఉపవాసదీక్ష విరమణ అనంతరం ఇఫ్తార్ విందు చేస్తున్న ముస్లింలు

ఉదయగిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఉపవాస దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీక్షబూనిన ముస్లింలు ఉదయం 4.30 గంటల్లోపు సహర్ పేరుతో ఆహారాన్ని స్వీకరించారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల తరువాత ఇఫ్తార్ విందు చేసి ఉపవాస దీక్షను విరమించారు. నెలరోజులపాటు ముస్లింలు ఈ ఉపవాస దీక్షలు చేయనుండడంతో మసీదు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

హైలెవెల్ కెనాల్ పనులు ప్రారంభించాలి

● అఖిలపక్ష నేతల డిమాండ్



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య

మర్రిపాడు, మార్చి 2 (అంధ్యజ్యోతి): ఆనం సంజీవ రెడ్డి హై లెవెల్ కెనాల్ పను లను తిరిగి చేపట్టాలని, అందు కు బడ్జెట్లో నిధులు కేటాయిం చాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఆదివారం రైతులతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లా డుతూ గత టీడీపీ ప్రభుత్వంలో 2014లో ప్రారంభించి నేటికి 69శాతం మాత్రమే పనులు పూర్తి చేశారని, ప్రభుత్వాలు శ్రద్ధ పెడితే ఏడాది కాలంలో పూర్తి చేయవచ్చని అన్నారు. పనులు పూర్తయితే ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు మండలాలల్లో సుమారు 90వేల ఎకరాలకు సాగు నీరు, 2.50లక్షల జనాభాకు తాగునీరు అందుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో సోమశిల డ్యామ్ వద్ద అప్రాన్ దెబ్బతిందని అప్పటి ఎమ్మెల్యేని పలుమార్లు కలిసి విన్నవించుకుంటే చేస్తానని చెప్పి కాలం వెల్లబుచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వెంగయ్య, రాజగోపాల్, శ్రీరాములు, వైసీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వరెడ్డి, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఉదయగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి అనూష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టీకాలను నాలుగు నెలలు దాటిన దూడలు, గేదెలు, ఆవులకు ఈనెల 31వ తేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

● సీతారామపురం : పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి వి అనూష ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి మార్చి 30వ తేదీ వరకు స్థానిక పశువైద్యశాల పరిధిలోని అన్ని పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు.

శరవేగంగా లింకురోడ్ల నిర్మాణ పనులు



167బీ జాతీయ రహదారి నుంచి జరుగుతున్న పలుకూరు రోడ్డు నిర్మాణం

కందుకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో మహాత్మాగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపో నెంట్ నిధులతో మంజూరైన లింకురోడ్ల నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. రూ. 11.5 కోట్ల అంచనా వ్యయంతో పలు గ్రామాల మధ్య లింకురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుకాగా గత నెలలో పనులు ప్రారంభమయ్యాయి. కందుకూరు మండలంలో 167బీ జాతీయ రహదారి నుంచి పలుకూరు గ్రామానికి, ఇదే జాతీయ రహదారి నుంచి మహదేవపురం గ్రామానికి లింకురోడ్లును బీటీరోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు కాగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వలేటివారిపాలెం మండలంలో కళవళ్ల నుంచి వీఆర్ కోటకు, శింగమనేనిపల్లి నుంచి పోకూరు, 167బీ జాతీయ రహదారి నుంచి కొండసముద్రం, రోళ్లపాడు గ్రామాలకు లింకురోడ్లు మంజూరు కాగా పనులన్నీ వేగవంతంగా జరుగుతున్నాయి. శింగమనేనిపల్లి - పోకూరు రోడ్డు జీఎస్బీ, వెట్మిక్స్ పనులు జరుగుతుండగా మరో పది, పదిహేనురోజుల్లో తారురోడ్డుగా అభివృద్ధి చేసేదిశగా పనులు సాగుతున్నాయి. కొండముడుసుపాలెంలో కేజీటీ రోడ్డు వయా ఎస్సీ కాలనీ రోడ్డు అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఉలవపాడు మండలంలో కుమ్మరిపాలెం - కొల్లూరుపాడు రోడ్డు పనులు వేగంగా సాగుతుండగా గుడ్లూరు మండలంలో పాజర్ల రోడ్డు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.